

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 10-06-2025 | సంపుటి - 24 | సంచిక - 39 | రూ : 4 | పేజీలు: 8

## ముర్కి వ్యాఖ్యల కేసులో కొమ్మినేని అరెస్టు

- హైదరాబాద్ నుంచి నల్లపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలింపు
- ఇంకా పరారీలోనే మరో నిందితుడు కృష్ణంరాజు
- రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిన ఆగ్రహ ప్రదర్శనలు
- నిరసనకారులపై సజ్జల వివాదాస్పద వ్యాఖ్యలు
- భారతి రెడ్డి క్షమాపణ చెప్పాలని షర్మిల డిమాండ్
- అరెస్టును ఖండించిన జగన్ 2లో



## 'కాళేశ్వరం'లోని మరో ప్యాకేజీపై విజి'లెన్స్'

- అనంతగిరి రిజర్వాయర్ నుంచి నీటిని ఎత్తిపోసే పనికి సంబంధించిన వివరాలివ్వాలని ఈఈకి లేఖ



**జూన్ 9, హైదరాబాద్:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపట్టిన పనుల్లో మరో ప్యాకేజీపై విజిలెన్స్ విచారణ చేపట్టింది. నాలుగో లింక్‌లోని రెండో ప్యాకేజీగా జరిగిన అనంతగిరి రిజర్వాయర్ నుంచి నీటిని ఎత్తిపోసే పనికి సంబంధించిన వివరాలను వెంటనే అందజేయాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు లేఖ రాశారు. ఇప్పటికే రెండు ప్యాకేజీల పనులకు సంబంధించి ఇటీవలే విచారణ ప్రారంభం కాగా, ఇప్పుడు మరో ప్యాకేజీపై విజిలెన్స్ దర్యాప్తు

తరువాయి 2లో

## రగులుతున్న లాస్ ఏంజెలెస్

- అక్రమ వలసదారుల అరెస్టుతో రాజుకున్న అగ్గి
- వీధుల్లోకి వేలమంది జనం
- జాతీయ రహదారి దిగ్బంధం
- వాహనాలకు నిప్పు
- ఆందోళనకారులపై రబ్బర్ బుల్లెట్ల ప్రయోగం

లాస్ ఏంజెలెస్: అక్రమ వలసదారుల అరెస్టుతో అగ్గి రాజుకున్న అమెరికాలోని లాస్ ఏంజెలెస్ నగరంలో నిరసనల పర్వం కొనసాగుతోంది. మూడో రోజైన ఆదివారం వేలమంది జనం వీధుల్లోకి వచ్చారు. అత్యంత కీలకమైన



## 27 మంది ఉపాధ్యక్షులు.. 69 మంది ప్రధాన కార్యదర్శులు




- పీసీసీ కార్యవర్గంలో కీలక పదవుల ప్రకటన
- ఒక ఎంపీ, ఐదుగురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలకు చోటు
- విధేయత, సామాజిక న్యాయానికి ప్రాధాన్యం
- బడుగువర్గాల నేతలకు 68% పదవులు
- వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టులపై కొనసాగుతున్న ఉత్కంఠ

**జూన్ 9, హైదరాబాద్:** రాష్ట్ర కాంగ్రెస్ శ్రేణులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) కార్యవర్గంలో కీలక పదవులను ప్రకటించారు. మొత్తం 27 మంది రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షులను, 69 మంది ప్రధాన కార్యదర్శులను పార్టీ అధిష్ఠానం వెల్లడించింది. పీసీసీలో అత్యంత కీలకమైన వర్కింగ్ ప్రెసిడెంట్ పదవులను ఇంకా ప్రకటించలేదు. పదవుల భర్తీలో విధేయత, సామాజిక న్యాయానికి

తరువాయి 2లో

## అనుమతులన్నీ ఇస్తున్నాం.. సకాలంలో పనులు జరగాల్సిందే

- లేకపోతే గుత్తేదార్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని కేంద్రాన్ని కోరతా
- ఎన్‌హెచ్ ప్రాజెక్టులపై ఇక మూణ్నెల్లకోసారి సమీక్ష"
- సీఎం చంద్రబాబు స్పష్టీకరణ

**జూన్ 9, అమరావతి:** 'అవసరమైన అనుమతులన్నీ ఇస్తున్నాం. ఎక్కడికక్కడ సమస్యలు పరిష్కరిస్తున్నాం. ఏ ఆటంకాలూ లేకపోయినా పనుల్లో జాప్యం ఎందుకు జరుగుతోంది? ఇకపై గడువులోగా జాతీయ రహదారుల నిర్మాణం పూర్తి కావాల్సిందే' అని సీఎం చంద్రబాబు ఆదేశించారు. హైవేల నిర్మాణ పనుల్లో జాప్యం చేస్తే, ఆయా గుత్తేదార్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలంటూ తానే కేంద్రాన్ని కోరతానని హెచ్చరించారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ఎన్‌హెచ్

తరువాయి 2లో



## ప్రజలే కేంద్రంగా పాలన

- 11 ఏళ్ల ప్రస్థానంలో సమ్మిళిత, సర్వతోముఖాభివృద్ధి
- ప్రపంచంపైనా బలమైన ముద్ర వేశాం: మోదీ
- జవాబుల్ని దాటవేస్తున్నారని కాంగ్రెస్ ఎద్దేవా



**జూన్ 9, ఢిల్లీ:** తన నేతృత్వంలోని 11 ఏళ్ల పాలనలో దేశం అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించడంతోపాటు వాతావరణ మార్పులు, డిజిటల్ నవకల్పనలు వంటి అంశాల్లో ప్రపంచ వేదికపైనా బలమైన ముద్ర వేసిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. 'సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్.. సబ్‌కా విశ్వాస్.. సబ్‌కా ప్రయాస్' (అందరితో కలిసి.. అందరి అభివృద్ధికి.. అందరి విశ్వాసంతో.. అందరి కృషితో) అనేదే తమ పాలనను నిర్దేశించే మూలసూత్రమని చెప్పారు. తన నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం మూడో విడత పాలనలో తొలి ఏడాది పూర్తిచేసుకోవడం, మొత్తంగా ప్రధానిగా పగ్గాలు చేపట్టి సోమవారానికి 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా విజయాలను '11 ఏళ్ల సేవ' పేరుతో 'ఎక్స్' ద్వారా ఆయన పంచుకున్నారు. సమూల మార్పుల్ని అత్యంత వేగంగా, భారీ పరిమాణంలో తమ సర్కారు చేసి చూపించిందని తెలిపారు. 81 కోట్ల మందికి ఉచిత ఆహారధాన్యాలు, 15 కోట్ల మందికి కొళాయి కనెక్షన్లు, పేదల కోసం నాలుగు కోట్ల ఇళ్లను నిర్మించడం, దేశవ్యాప్తంగా 12 కోట్ల మరుగుదొడ్ల నిర్మాణం వంటివి ఆయన ప్రస్తావించారు. మంత్రిమండలిలో 60 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలవారే ఉన్నట్లు తెలిపారు. వీరికి ఈ స్థాయిలో పదవులు కేటాయించడం ఇదే తొలిసారి అని చెప్పారు.

తరువాయి 2లో



## శాఖల కేటాయింపుపై కసరత్తు

- కేసీ వేణుగోపాల్‌తో సీఎం భేటీ
- మల్లికార్జున ఖర్గేతో నేడు..

**జూన్ 9,** దిల్లీ: తెలంగాణ మంత్రివర్గంలో కొత్తగా చేరిన ముగ్గురు మంత్రులకు శాఖల కేటాయింపులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కసరత్తు ప్రారంభించారు. ఇదే అంశంపై సోమవారం మధ్యాహ్నం దిల్లీకొచ్చిన ఆయన సాయంత్రం ఇక్కడి ఇందిరాభవన్‌లో పార్టీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌ఛార్జి కేసీ వేణుగోపాల్‌తో సుమారు గంటపాటు చర్చించారు. ఈ సందర్భంగా పాత మంత్రులు చూస్తున్న బాధ్యతలు, ప్రస్తుతం ఖాళీగా ఉన్న శాఖల జాబితాను ఆయనకు అందించినట్లు

తరువాయి 2లో

## బస్‌పాస్ ఛార్జీల పెంపు




- ఇకపై జనరల్ నెలవారీ విద్యార్థి పాస్ ధర రూ.600
- హైదరాబాద్ మెట్రో ఎక్స్‌ప్రెస్‌లలో విద్యార్థి పాస్‌లకు అనుమతి
- టోల్‌ప్లాజా యూజర్ ఛార్జీ ఒక్కొక్కరికి రూ.10 వసూలు
- టీజీఎస్ ఆర్టీసీ ప్రకటన

**జూన్ 9, హైదరాబాద్:** బస్‌పాస్ ఛార్జీలను సోమవారం నుంచి పెంచినట్లు ఆర్టీసీ ఒక ప్రకటనలో తెలిపింది. విద్యార్థుల బస్‌పాస్ ఛార్జీలను గత మూడేళ్లుగా పెంచలేదని, పెరిగిన ఖర్చుల కారణంగా ఇప్పుడు అన్ని రకాల పాస్‌ల ఛార్జీలను పెంచుతున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్ సబర్బన్ ప్రాంతాల్లో సిటీ బస్సుల్లో రద్దీ ఎక్కువగా ఉంటోంది. దీన్ని తగ్గించడానికి ఇకపై ఆర్డినరీతోపాటు హైదరాబాద్ నగరంలో నడిచే మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులలోనూ పాస్ ఉన్న విద్యార్థులను అనుమతిస్తామని తెలిపింది. దశాబ్దాలుగా ప్రయాణికులు, విద్యార్థులు ఆర్టీసీని ఎంతగానో ఆదరిస్తున్నారని ఛార్జీల పెంపును కూడా స్వాగతించాలని ఆర్టీసీ కోరింది. అదేసమయంలో టోల్ ప్లాజా యూజర్ ఛార్జీని ఒక్కో ప్రయాణికుడి నుంచి రూ.10 చొప్పున

తరువాయి 2లో

# బస్‌పాస్ ఛార్జీల పెంపు

(మొదటిపేజీ తరువాయి)

వసూలు చేస్తామంది. టోల్‌ప్లాజా రూట్‌లో వెళితేనే యూజర్ ఛార్జీ ఉంటుందని, ఆ మార్గంలో వెళ్లని బస్సులకు ఇది వర్తించదని స్పష్టంచేసింది. పెంచిన బస్‌పాస్ ఛార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పేదలు ప్రయాణించే ఆర్టీసీ బస్సుల్లో పెద్దఎత్తున బస్‌పాస్ ఛార్జీలు పెంచడం ప్రభుత్వానికి, ఆర్టీసీకి తగదని ఆయన నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒకవైపు మహాలక్ష్మి పేరుతో ఉచిత బస్ ప్రయాణమంటూనే, మరోపక్క ఛార్జీలు పెంచిందని ఆయన విమర్శించారు.ఆరోగ్యం విషమించడంతో ఆదివారం ఉదయం 5:45 గంటల ప్రాంతంలో తుదిశ్వాస విడిచారని వైద్యులు తెలిపారు. ఆయన ఆకస్మిక మరణం పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

# అనుమతులన్నీ ఇస్తున్నాం.. సకాలంలో పనులు జరగాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

ప్రాజెక్టులపై అధికారులు, గుత్తేదారులతో సీఎం చంద్రబాబు సోమవారం సచివాలయంలో సమీక్షించారు. బెంగళూరు కడప విజయవాడ ఎన్‌హెచ్‌లో భాగమైన కోడూరు క్రాస్ కడప ముప్పవరం ప్యాకేజీలో పనులు నెమ్మదిగా జరగడం, మరికొన్ని ప్రాజెక్టుల్లోనూ ఇలాంటి పరిస్థితే ఉండటంపై సీఎం అసంతృప్తి వ్యక్తంచేశారు. ఇకపై ఏ రహదారి నిర్మాణంలోనూ ఆలస్యం జరగకూడదని స్పష్టంచేశారు. ఎన్‌హెచ్ ప్రాజెక్టులకు భూసేకరణ, అటవీ, వన్యప్రాణి అనుమతులు తదితర సమస్యలను జులై నాటికి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పనుల వేగిరానికి ఉన్న ఆటంకాలేంటి? ప్రభుత్వపరంగా చేయాల్సిందేంటి అని ఆయా గుత్తేదారు సంస్థల ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు.

*** సమీక్ష సమావేశంలో సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఉన్నతాధికారులు**

**ఈ ఏడాది 1,040 కి.మీ. లక్ష్యం**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.20,067 కోట్లతో నిర్మిస్తున్న రూ.1,040 కి.మీ. ఎన్‌హెచ్‌లను పూర్తిచేయాలనే లక్ష్యంతో పనిచేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ), కేంద్ర రహదారులు, ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ (మోర్త్)లకు చెందిన 144 ప్రాజెక్టుల్లో కలిపి మొత్తంగా రూ.76,856 కోట్లతో 3,483 కి.మీ. మేర రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వీటన్నింటిలోనూ పురోగతి కనిపించాలని, ఇకపై ప్రతి మూణ్నెల్లకోసారి ప్రాజెక్టులవారీగా సమీక్షిస్తానని సీఎం పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.11,325 కోట్లతో 770 కి.మీ. మేర ఎన్‌హెచ్‌లు పూర్తయినట్లు అధికారులు వివరించారు.

**జులైకల్లా గుంతల్లేకుండా..**

రాష్ట్రంలోని ఆర్‌అండ్‌బీ రోడ్లలో 19,475 కి.మీ. మేర గుంతలు లేకుండా మరమ్మతులు చేశామని అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. 'గుంతల రహిత రహదారుల మిషన్ కింద రూ.860.81 కోట్లతో ఈ పనులను గత నవంబరులో ప్రారంభించగా, ఇప్పటికే 97% పూర్తయ్యాయి. మిగిలిన పనులు జులై నాటికి పూర్తిచేస్తామ'ని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, ఈఎన్‌సీలు నయీముల్లా, రామచంద్ర, సీఈలు శ్రీనివాసరెడ్డి, వివేకానందరెడ్డి, ఎన్‌హెచ్‌ఏఐ ప్రాంతీయ అధికారి ఆర్కే సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలే కేంద్రంగా పాలన

(మొదటిపేజీ తరువాయి)

**అన్ని రంగాలకు పెద్ద దెబ్బ: కాంగ్రెస్**

మోదీ 11 ఏళ్ల పాలన దేశ ప్రజాస్వామ్యానికి, ఆర్థిక రంగానికి, సామాజిక కూర్పునకు పెద్దదెబ్బ అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. రాజ్యాంగంలోని ప్రతి పేజీకి ప్రభుత్వం నియంతృత్వాన్ని అద్దిందని తూర్పారబట్టారు. రాజ్యాంగ వ్యవస్థల్ని భాజపాఆరెస్సెస్ బలహీనపరిచాయని చెప్పారు. ప్రభుత్వం చెబుతున్న పథకాలన్నీ విఫలమయ్యాయన్నారు. వర్తమానం గురించి ప్రభుత్వం మాట్లాడటం మానేసి 2047పై కలల్లో విహరిస్తోందని లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీ ఎద్దేవాచేశారు. 11 ఏళ్లలో మార్పు గానీ, జవాబుదారీతనం గానీ లేవని, కేవలం ప్రచారమే జరుగుతోందని విమర్శించారు.

# కాళేశ్వరం'లోని మరో ప్యాకేజీపై విజి'లెన్స్'

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభించడం నీటిపారుదలశాఖలో సంచలనంగా మారింది. ఒక్కో ప్యాకేజీలో 60 మందికి పైగా ఇంజినీర్లు విచారణకు హాజరుకావాల్సి వస్తోంది. ఒక ప్యాకేజీలో విచారణ ఎదుర్కొన్నవారిలో అత్యధికులు ఇంకో ప్యాకేజీలో కూడా ఉంటున్నారు.

**15 అంశాలపై నివేదికలు ఇవ్వాలని..**

ఇటీవల కొండపోచమ్మసాగర్‌పైన, ఈ రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోసే పనులపైన, బస్వాపూర్ రిజర్వాయర్‌పైన విజిలెన్స్ దర్యాప్తు చేపట్టింది. కొండపోచమ్మ పనులపై ఎనిమిది రోజులపాటు నిర్మాణం, క్వాలిటీ కంట్రోల్, డిజైన్స్, రాష్ట్రస్థాయి స్టాండింగ్ కమిటీ ఇలా వివిధ విభాగాలకు సంబంధించి ఉన్నత స్థాయి ఇంజినీర్ల నుంచి ఏఈఈల వరకు 60 మందికి పైగా ఇంజినీర్లు విచారణకు హాజరయ్యారు. మరోవైపు కాళేశ్వరంతో సంబంధం లేని, వరదకాలువలో భాగంగా నిర్మించిన మిడ్‌మానేరుపై 2021లోనే ఫిర్యాదు వచ్చింది. అయితే విచారణ చేపట్టలేదు. ఇటీవల విజిలెన్స్ విచారణ మొదలుపెట్టింది. ఇందులో ఈఎన్సీతో సహా ఆరుగురిని విచారణకు పిలిచారు. మిడ్‌మానేరుకు సంబంధించి ఈఎన్సీ జనరల్ అనిల్‌కుమార్ సోమవారం విజిలెన్స్ విచారణకు హాజరైనట్లు తెలిసింది. తాజాగా కాళేశ్వరం ఎత్తిపోతల నాలుగో లింకులోని అనంతగిరి రిజర్వాయర్ నుంచి సిద్దిపేట జిల్లాలోని చిన్నగుండవల్లి వద్ద గల సిస్టర్న్ వరకు చేసిన పనులకు సంబంధించి ప్యాకేజీ రికార్డులన్నీ అందజేయాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ అధికారి సిద్దిపేటలోని ఇరిగేషన్ డివిజన్ 2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు లేఖ రాశారు. ఈ నెల 5న లేఖ రాసి వారంలోగా రికార్డులన్నీ అందజేయాలని కోరారు. జరిగిన పని, చేసిన ఖర్చు గురించి సమగ్ర వివరాలు అందజేయాలని, పరిపాలన, సాంకేతిక అనుమతులు, ఒప్పందం, అనుబంధ ఒప్పందాలు, బ్యాంకు గ్యారంటీలు, ఎం.బుక్కులు, డిజైన్లు, గ్రామాల వారీగా భూసేకరణ వివరాలు, నాణ్యతా రిపోర్టులు, ఉన్నతాధికారుల తనిఖీ నివేదికలు ఇలా మొత్తం 15 అంశాలపై నివేదికలు కోరారు. ప్రస్తుతం లేఖ అందుకొన్న ఈఈని విజిలెన్స్‌లో నియమించాలని నీటిపారుదల శాఖ సిఫార్సు చేసినట్లు తెలిసింది.

## 27 మంది ఉపాధ్యక్షులు..

# 69 మంది ప్రధాన కార్యదర్శులు

(మొదటిపేజీ తరువాయి)

అత్యధిక ప్రాధాన్యం దక్కింది. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పనిచేస్తున్నవారి వివరాలను జిల్లాలవారీగా సేకరించి ఈ పదవులకు ఎంపికచేశారు. మంత్రివర్గ విస్తరణలో మాదిరి పీసీసీలోనూ బడుగువర్గాల వారికి ప్రాధాన్యమిచ్చారు. మొత్తం 27 మంది ఉపాధ్యక్షుల్లో బీసీలకు 8, ఎస్సీలకు 5, ఎస్టీలకు 2, ముస్లిం మైనార్టీలకు 3 కలిపి 67% పదవులు దక్కాయి. ఇక ప్రధాన కార్యదర్శులు 69 మందిలో 68% పదవులు బడుగులకే దక్కాయి. వీరిలో బీసీలకు 26, ఎస్సీలకు 9, ఎస్టీలకు 4, ముస్లింలకు 8 పదవులిచ్చారు. కాంగ్రెస్‌లో ఇరవై ఏళ్లుగా కొనసాగుతున్న సీనియర్ నేతలకే ఎక్కువ పదవులు ఇచ్చినట్లు పార్టీవర్గాలు తెలిపాయి. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో కలసి గతంలో ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్‌లలో పనిచేసిన వారికి చోటుదక్కడం గమనార్హం. ఉపాధ్యక్ష పదవుల్లో ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, బస్వరాజ్ సారయ్యలతోపాటు సీనియర్ నేతలైన కుమార్‌రావు, కొండ్రు పుష్పలీలతోపాటు పార్టీలోకి కొత్తగా వచ్చిన బొంతు రాంమోహన్‌వంటి వారికి చోటుదక్కింది. ప్రధాన కార్యదర్శులుగా ముగ్గురు ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, పర్నికారెడ్డి, మట్టా రాగమయితోపాటు సీనియర్ నేత షబ్బీర్‌అలీ, కత్తి వెంకటస్వామి, శశికళా యాదవరెడ్డి తదితరులున్నారు. మొత్తమ్మీద ఐదుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ, ఇద్దరు ఎమ్మెల్సీలకు ఈ పదవులు కట్టబెట్టారు. మిగిలిన వారిలో ఎక్కువ మంది ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్న వారేనని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ 'ఈనాడు'కు తెలిపారు. సీనియర్లు, జూనియర్ల కలయికతో కొత్త తరానికి కూడా తగిన ప్రాధాన్యమిచ్చినట్లు ఆయన వివరించారు. పార్టీ కోసం క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేసేవారికే రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించడానికి కృషిచేశామన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ పదవుల భర్తీలోనూ సామాజిక న్యాయానికే పెద్దపీట వేస్తామని ఆయన స్పష్టంచేశారు.

**ప్రధాన కార్యదర్శులు...**

ఎమ్మెల్యేలు... వెడ్మ బొజ్జు, సీహెచ్ పర్నికారెడ్డి, మట్టా రాగమయి, నేతలు... షబ్బీర్‌అలీ, సీహెచ్ రాంభూపాల్, ఎ.సంజీవ్ ముదిరాజ్, బొజ్జా సంధ్యారెడ్డి, మల్లాడి రామిరెడ్డి, అబ్దేషి సదాలక్ష్మి, ఎం.బేబీ స్వర్ణకుమారి, ధారాసింగ్ తాండూరు, జి.శశికళా యాదవరెడ్డి, కత్తి వెంకటస్వామి, మహమ్మద్ అబ్దుల్ ఫహీం, సంతోష్‌కుమార్ రుద్ర, దుర్గం భాస్కర్, మహమ్మద్ ఖాజా ఫక్రుద్దీన్, వి.జగదీశ్వర్‌గౌడ్, నరేష్‌జాదవ్, అల్లంభాస్కర్, గిరిజా శెట్కార్, కొప్పుల ప్రవీణ్‌కుమార్, ఎ.జంగారెడ్డి, కస్బా శ్రీనివాస్‌రావు, దుద్దిళ్ల శ్రీనివాస్, బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, చరగని దయాకర్, పీసరి మహిపాల్‌రెడ్డి, గజ్జెలకాంతం, ఈడ్పుగంటి సుబ్బారావు, చకిలం రాజేశ్వరరావు, ఈర్ల కొమరయ్య, ఎ.రవిబాబు, నాగ సీతారాములు, శానెం శ్రీనివాస్‌గౌడ్, పృథ్వీచౌదరి వేముల, అంబడి రాజేశ్వర్, డీడీ వెంకట్‌రాజ్, బోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పల్లె శ్రీనివాస్‌గౌడ్, కాట్ల రంగారావు, పి.శ్రీనివాస్‌రెడ్డి, మాడు సత్యనారాయణగౌడ్, తోపాజీ అనంతకిషన్, వి.రామారావుగౌడ్, అచ్యుత్ రమేష్‌బాబు, పెద్దనోళ్ల బాల మురళీకృష్ణ(చిన్న), ఎం.రాజీవ్‌రెడ్డి, షమీమ్ ఆఫూ, ఈవీ శ్రీనివాస్‌రావు, మిథున్‌రెడ్డి, అమొగోత్ వెంకటేష్‌పవార్, రాయగిరి కల్పనాయాదవ్, రాజేష్ కషిపాక, రహమత్ హుస్సేన్, పి.ప్రసన్నకుమార్ శర్మ, మహమ్మద్ అసదుద్దీన్, నందిమళ్ల యాదయ్య ముదిరాజ్, దైదా రవీందర్, ఉప్పల శ్రీనివాస్‌గుప్త, గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, జి.నాగభూషణం, ఉపేందర్‌రెడ్డి, ధర్మారావు, నూతి సత్యనారాయణగౌడ్, దుర్గాప్రసాద్, సి.వెంకట గోవింద్‌రావు, పెండ్లి శ్రీనివాసులురెడ్డిలు ప్రధాన కార్యదర్శులుగా నియమితులయ్యారు.

**వీరే కొత్త ఉపాధ్యక్షులు**

ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, బస్వరాజ్ సారయ్య, నేతలు... కుమార్‌రావు, ఝాన్సీరెడ్డి, బండి రమేశ్, కొండ్రు పుష్పలీల, కోట నీలిమ, కైలాశ్‌కుమార్, నమిండ్ల శ్రీనివాస్, ఆత్రం సుగుణ, గాలి అనిల్‌కుమార్, చిట్ల సత్యనారాయణ, లకావత్ ధనవంతి, ఎం.వేణుగౌడ్, కొమిరెడ్డి వినయ్‌రెడ్డి, కొండేటి మల్లయ్య, ఎం.ఎ.ఫహీం, సురేష్‌కుమార్, బొంతు రాంమోహన్, ఆఫ్సర్ యూసుఫ్‌జాహీ, ఎస్.జగదీశ్వర్‌రావు, ముజాహిద్ ఆలంఖాన్, గుమ్ముల మోహన్‌రెడ్డి, చిన్నపటల సంగమేశ్వర్‌లు ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు.

# శాఖల కేటాయింపుపై కసరత్తు

(మొదటిపేజీ తరువాయి)

తెలిసింది. కొత్తవారికి పూర్తిగా కొత్త శాఖలు కేటాయించాలా... పాత మంత్రులు చూస్తున్న అదనపు శాఖలను వారి నుంచి తొలగించి వీరికివ్వాలా... అన్న విషయమై సమాలోచనలు చేశారు. ప్రస్తుతం సీఎంతోపాటు 11 మంది మంత్రుల చేతుల్లో దాదాపు 29 శాఖలున్నాయి. కీలకమైన మున్సిపల్, హోం, విద్యా శాఖలను సీఎం తనవద్దే ఉంచుకున్నారు. శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్కల వద్ద మూడేసి శాఖలున్నాయి. తాజా విస్తరణతో క్యాబినెట్‌లో మంత్రుల సంఖ్య 15కి చేరింది. మంత్రివర్గ విస్తరణలో ఎస్సీ, బీసీ సామాజికవర్గాలకు ప్రాధాన్యం కల్పించి, సామాజిక న్యాయ సిద్ధాంతాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లామని, మంత్రులకు శాఖల కేటాయింపులోనూ అదే ప్రాధాన్యం కొనసాగించాలనే విషయంపైనా వారు మాట్లాడుకున్నట్లు సమాచారం. మిగిలిన ఖాళీల భర్తీ అంశం కూడా ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. మాజీ మంత్రి పి.సుదర్శన్‌రెడ్డితోపాటు మరో ఇద్దర్ని క్యాబినెట్‌లోకి తీసుకోవాలని భావించినప్పటికీ సాధ్యంకాకపోవడానికి దారితీసిన అంశాలపై ఇద్దరు నేతలు మాట్లాడుకున్నట్లు తెలిసింది. అసంతృప్త నాయకులతో పార్టీ రాష్ట్ర నాయకత్వం మాట్లాడిన విషయంపైనా రేవంత్‌రెడ్డి... వేణుగోపాల్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఇప్పటివరకున్న సమాచారం ప్రకారం ముఖ్యమంత్రి, పాత మంత్రుల శాఖల్లో మార్పులు చేయబోరని, కొత్తవారికి కొత్త శాఖలు కేటాయిస్తారని పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. హోం, ప్రాథమిక, ఉన్నత, వైద్య విద్య శాఖలు, పశు సంవర్ధకం, పాడి పరిశ్రమాభివృద్ధి, గనులు, మైనార్టీ సంక్షేమం, వాణిజ్య పన్నులు, కార్మిక, ఎంఎస్ఎంఈ, క్రీడలు, యువజన వ్యవహారాల శాఖలు ఖాళీగా ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖను ఎవరికీ కేటాయించలేదు. మున్సిపల్ శాఖను కోర్, రూరల్ విభాగాలుగా విభజించారు. ఇందులో కొన్ని కొత్త మంత్రులకు అప్పగించవచ్చని చెబుతున్నారు. అయితే, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేతో చర్చించిన అనంతరం దీనిపై ఒక నిర్ణయానికి రావాలని వారిద్దరూ ఏకాభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో రేవంత్‌రెడ్డి మంగళవారం మల్లికార్జునఖర్గేతో సమావేశమయ్యే అవకాశం ఉందని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. ఆ తర్వాతే శాఖల కేటాయింపుపై స్పష్టత వస్తుందని భావిస్తున్నారు.

# మురికి వ్యాఖ్యల కేసులో కొమ్మినేని అరెస్టు

హైదరాబాద్, అమరావతి: 'అమరావతి వేశ్యల రాజధాని' అంటూ అత్యంత జుగుప్సాకరమైన వ్యాఖ్యలు చేసిన కేసులో.. సాక్షి టీవీ ఛానల్ వ్యాఖ్యాత కొమ్మినేని శ్రీనివాసరావును గుంటూరు జిల్లా తుళ్లూరు పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసం వద్ద ఉదయం 11 గంటల సమయంలో అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి గుంటూరు జిల్లాకు తరలించారు. 'అమరావతి దేవతల రాజధాని కాదు.. అది వేశ్యల రాజధాని' అంటూ నాలుగు రోజుల కిందట సాక్షి టీవీ ఛానెల్‌లో ప్రసారమైన 'కేఎస్ఆర్ లైవ్ షో'లో పాత్రికేయుడు వీవీఆర్ కృష్ణంరాజు అత్యంత దారుణమైన వ్యాఖ్యలు చేశారు. ఆ కార్యక్రమాన్ని నిర్వహించిన సాక్షి ప్రతినిధి కొమ్మినేని శ్రీనివాసరావు ఆ వ్యాఖ్యల్ని ఖండించకపోగా వాటిని కొనసాగించేందుకు మరింత ఊతమిచ్చారు. ఈ అనుచిత వ్యాఖ్యలపై గత రెండురోజులుగా రాష్ట్రమంతటా మహిళలు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు చేస్తున్న విషయం తెలిసిందే. సోమవారం కూడా రాష్ట్రవ్యాప్తంగా 'సాక్షి' కార్యాలయాల వద్ద మహిళల తీవ్ర నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. వ్యవస్థీకృత కుట్రలో భాగంగా సాక్షి యాజమాన్యం ప్రోత్సాహంతోనే అమరావతి మహిళలను కించపరిచేలా ఈ వ్యాఖ్యలు చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలంటూ అన్ని జిల్లాల్లోనూ పోలీసుస్టేషన్లలో ఫిర్యాదులిచ్చారు. ఇంత జరుగుతున్నా తాజాగా నిరసనకారులపై వైకాపా నేత సజ్జల వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం గమనార్హం. సాక్షి ఛానెల్‌లో చర్చ సందర్భంగా అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం వెనుక జగన్, భారతి ఉన్నారని మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ ధ్వజమెత్తారు. రాజధాని ప్రాంతంలోని రాయపూడి గ్రామానికి చెందిన అమరావతి దళిత ఐకాస నాయకురాలు కంభంపాటి శిరీష ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తుళ్లూరు పోలీసులు కేసు నమోదుచేసి.. కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టుచేశారు. మంగళవారం ఉదయం ఆయన్ను కోర్టులో హాజరుపరుస్తారు.

**శ్ర సాక్షి యాజమాన్యం ప్రోద్బలంతోనే..**

తుళ్లూరు పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసులో వీవీఆర్ కృష్ణంరాజును (ఏ1), కొమ్మినేని శ్రీనివాసరావును (ఏ2), సాక్షి యాజమాన్యాన్ని (ఏ3)గా చేర్చారు. మహిళల ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా, వర్గాల మధ్య శత్రుత్వం పెంచేలా వ్యాఖ్యలు చేయటం, మతపరమైన విద్వేషాలు రెచ్చగొట్టేందుకు యత్నించటం, నేరపూరిత కుట్ర, పరువునష్టంతో పాటు, దళిత మహిళల్ని కించపరిచారనే అభియోగాలపై బీఎన్ఎస్, ఐటీ చట్టం, ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ నిరోధక చట్టంలోని సెక్షన్ల కింద ఈ ముగ్గురిపై అభియోగాలు మోపారు. ''అమరావతి దేవతల రాజధాని కాదు.. వేశ్యల రాజ ధాని. దాని చుట్టుపక్కల ఎయిడ్స్ వ్యాధి గ్రస్థులు ఎక్కువ ఉన్నారంటూ వీవీఆర్ కృష్ణంరాజు పథకం ప్రకారమే వ్యాఖ్యలు చేశారు. సాక్షి యాజమాన్యం ప్రోద్బలంతోనే ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.సాక్షి పత్రిక, సాక్షి టీవీ ఛానెల్ రాజధాని అమరావతిపై కక్ష కట్టి గత పదేళ్లుగా ఓ పథకం ప్రకారం అభివృద్ధిని అడ్డుకుంటున్నాయి. కొందరు వ్యక్తులకు డబ్బులిచ్చి మరీ చర్చా కార్యక్రమాల్లో మాట్లాడిస్తూ అమరావతిపై విషం కక్కిస్తున్నారు. రాజధానిలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందని ఒకసారి, అమరావతి శ్మశాన వాటికంటూ మరోసారి, ఇదంతా ముంపు ప్రాంతమని దుష్ప్రచారం చేస్తున్నారు. ఇలా సాక్షి ఛానెల్‌లో చేసిన వ్యాఖ్యలు అమరావతి ప్రాంత మహిళలు, ప్రధానంగా దళిత మహిళల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా ఉన్నాయి. దీనికి బాధ్యులందరిపైనా ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ నిరోధక చట్టంలోని సెక్షన్ల కింద కేసు పెట్టాలి'' అంటూ శిరీష ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు.

*** 'కొమ్మినేని' పట్ల పోలీసుల వినయ విధేయతలు**

కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేసే సమయంలో ఏపీ పోలీసులు ఆయన పట్ల అత్యంత వినయ విధేయతలు ప్రదర్శించారు. అరెస్టు తర్వాత నేరుగా వాహనంలో తరలించకుండా ఆయన్ను గేటు బయట కుర్చీలో కూర్చోబెట్టి మరీ సాక్షి మీడియాతో మాట్లాడేందుకు

# రగులుతున్న లాస్ ఏంజెలెస్

(మొదటిపేజీ తరువాయి)

జాతీయ రహదారిని దిగ్బంధించారు. స్వీయ డ్రైవింగ్ కార్లకు నిప్పు పెట్టారు. అల్లర్లను అణచివేసేందుకు నేషనల్ గార్డులను ట్రంప్ ప్రభుత్వం మోహరించడంతో ప్రజల్లో ఆగ్రహం మరింత పెల్లుబికింది. ఆందోళనకారులను అడ్డుకునేందుకు పోలీసులు బాష్పవాయువు, రబ్బర్ బుల్లెట్లను, చెవులు చిల్లులు పడే శబ్దాలను ప్రయోగించారు. 40 లక్షల మంది జనాభా ఉన్న లాస్ ఏంజెలెస్‌లోని డౌన్‌టౌన్ అల్లర్లకు కేంద్ర స్థానంగా నిలిచింది. అక్కడి పలు మార్గాలను ఆందోళనకారులు దిగ్బంధించారు. ఈ ప్రాంతంలోకి 300 మంది నేషనల్ గార్డులు రావడంతో స్థానికుల్లో ఆగ్రహం వ్యక్తమైంది. చట్టవిరుద్ధంగా సమావేశం కావడాన్ని పోలీసులు నిషేధించడంతో ఆదివారం సాయంత్రానికి పలువురు ఆందోళనకారులు వెళ్లిపోయారు. మిగిలిన వారిని అరెస్టు చేసేందుకు పోలీసులు సిద్ధం కాగా.. వారు కొన్ని వస్తువులను, కాంక్రీట్ ముక్కలను, రాళ్లను విసిరారు. వీటి నుంచి తమను తాము రక్షించుకునేందుకు పోలీసులు వంతెన కిందకు వెళ్లి దాక్కోవాల్సి వచ్చింది. ఆందోళనకారుల దాడుల నుంచి జాతీయ కార్యాలయాలను, నిర్బంధ కేంద్రాలను రక్షించడానికి నేషనల్ గార్డులను రంగంలోకి దించారు. ఆందోళనలను కొనసాగిస్తున్న వారిని అడ్డుకునేందుకు భారీగా పోలీసులను వినియోగించినట్లు లాస్ ఏంజెలెస్ పోలీసు చీఫ్ మెక్ డొనెల్ తెలిపారు. డజన్ల మంది ఆందోళనకారులను అరెస్టు చేశామని వెల్లడించారు. వీరిలో పోలీసులపైకి మద్యం సీసాను విసిరేసిన వ్యక్తితోపాటు ద్విచక్ర వాహనంతో దూసుకొచ్చిన వ్యక్తి ఉన్నారు. మరోవైపు ఫేస్ మాస్కులతో ఉన్న ఆందోళనకారులను అరెస్టు చేయాలని ట్రంప్ ఆదేశించారు. శాన్‌ఫ్రాన్సిస్కోలోనూ డజన్ల కొద్దీ ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేశారు. అంతకుముందు కొన్ని భవనాలపైనా, పోలీసు వాహనాలపైనా దాడులు చేశారు.

# సీఎం పర్యటన ఆలేరుకు ఒరగబెట్టిందేమీ లేదు...

*** బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేష్**



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలేరు నియోజకవర్గ పర్యటన వల్ల ప్రయోజనం ఏమీ లేదని, కేవలం పదవి గండం భయంతో ఎమ్మెల్యేలు మంత్రులకు సీఎం భజన చేసినట్లుగా ఉపన్యాసం ఉందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేష్ ఆరోపించారు. సోమవారం రాజాపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులకు అభివృద్ధి ప్రదాత మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి నీ విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. వెంటనే బేషరత్తుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ వాళ్ళు బీఆర్ఎస్ నాయకులపై వ్యక్తిగత ఆరోపణలు మానుకోవాలని లేనిచో ప్రజలే తిరగబడే రోజులు వస్తాయని హెచ్చరించారు. సంస్కారం లేకుండా మాటలు మాట్లాడటం మానుకొని మానవతా విలువలతో కూడిన మాటలు మాట్లాడాలని హితోపలికారు. గత పది సంవత్సరాల టిఆర్ఎస్ పాలనలో అభివృద్ధిని కాంగ్రెస్ వాళ్లు చూడకపోవడం, ప్రజలకు కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్న ఇచ్చిన 420 హామీలు అమలు చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో సోయిలేని, ఉచిత బస్సును వినియోగించుకుంటున్న మహిళలను అవహేళన చేస్తూ, మిగతా హామీలన్నీ తుంగలో తొక్కారన్నారు. పింఛన్ పెంపు, తులం బంగారంతో పాటు రైతు భరోసాను ఎగనామం పెట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. గంధమల్ల ప్రాజెక్టు కాలేశ్వరం ప్రాజెక్టు అంతర్భాగమేనని, అలాంటి ప్రాజెక్టు బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే మంజూర అయిందని, యాదగిరిగుట్టలో మెడికల్ కళాశాల సైతం ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్రెడ్డి ప్రత్యేక కృషితో మాజీ ముఖ్యమంత్రి సీఎం కెసిఆర్ మంజూరు చేశారని గుర్తు చేశారు. మెడికల్ కళాశాల నిర్మాణ పనులకు అప్పట్లోనే అట్టహాసంగా శంకుస్థాపన చేసిన పనులకు మళ్లీ కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు శంకుస్థాపనలు చేయడం సిగ్గుచేటు అన్నారు. యాదగిరిగుట్ట పైన గోపురం స్వర్ణ తాపడం కోసం గత ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేశారే కానీ, ప్రస్తుత సీఎంకు ఎలాంటి సంబంధం లేదన్నారు. కాంగ్రెస్ నాయకుల వాలకం చూస్తుంటే పాత సీసాలో కొత్త కొత్త సారాల వ్యవహారం ఉందని ఎద్దేవా చేశారు. బీర్ల ఐలయ్య ఆలేరు పై అభివృద్ధి దృష్టి సారించాలని అనవసరంగా దూషించడం మానుకోవాలన్నారు. ఆలేరు ప్రజలు ఎమ్మెల్యే తీరును గమనిస్తున్నారని, ప్రజలకు ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని ఆలేరు అన్ని రంగాలు అభివృద్ధి చేసి చూపించి సత్తా చాటుకోవాలని కోరారు. లేనిచో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు డిపాజిట్ గల్లంతవ్వడం ఖాయమన్నారు. బీఆర్ఎస్ నాయకుల సహనాన్ని పరీక్షించొద్దని, వాళ్లు కన్నెర్ర చేస్తే గ్రామాలలో కాంగ్రెస్ నాయకులు తిరిగే ప్రసక్తే ఉండదని హెచ్చరించారు. రాజపేట మండలంలోని గొలుసుకట్టు చెరువులు 15వ ప్యాకేజీ ద్వారా నింపే కార్యక్రమాన్ని గతంలో గొంగిడి సునీత మహేందర్ రెడ్డి ప్రారంభించగా మిగిలిన పనులు మూడు నెలల్లో పూర్తి చేస్తానని చెప్పిన ప్రస్తుత ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అవసరమైతే సొంత నిధులు వెచ్చిస్తానని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సమావేశంలో నాయకులు రాజపేట పట్టణ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బెడిద వీరేశం, పి ఎ సి ఎస్ ఉపాధ్యక్షులు కాకల్ల ఉపేందర్, మాజీ ఎంపీపీ గోపగాని బాలమణి యాదగిరి గౌడ్, మాజీ మదర్ డైరీ డైరెక్టర్ చింతలపూరి వెంకటరామిరెడ్డి, టిఆర్ఎస్ పార్టీ మండల సెక్రటరీ జనరల్, రాజపేట పాలసోసైటీ చైర్మన్ సంధిల భాస్కర్ గౌడ్, ఎస్ఎస్. సి. సెల్ జిల్లా నాయకులు ఎర్ర గోకుల జస్వంత్, మేక వెంకటేశ్వర్ రెడ్డి, మర్ల నాగరాజు, బిళ్ళకుదురు రాజు, గొడుగు రాజు, గజ్జల రాజు, టిఆర్ఎస్ మండల పార్టీ ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీటీసీ బోగ హరినాథ్, లక్ష్మణ్ నాయక్, జిల్లా మాజీ ప్రజాప్రతినిధుల ఫోరం అధ్యక్షులు ఉప్పలయ్య గౌడ్, ఉల్లి రమేష్, రాజపేట మండల పార్టీ జనరల్ సెక్రటరీ సోమలింగం గుప్తా, ఎమ్మ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ మెడల్ ఫర్ గ్యాలంటరీ అవార్డును అందజేత



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:జూన్ 2వ తేదీన హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో జరిగిన తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాలలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పోలీస్ మెడల్ ఫర్ గ్యాలంటరీ అవార్డును అందుకున్న కొత్తగూడెం త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ శివప్రసాద్ ని సోమవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తమ కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తించినందుకుగాను ఇన్స్పెక్టర్ శివప్రసాద్ ఈ అవార్డును దక్కించుకోవడం జరిగింది.పోలీస్ శాఖలో క్రమశిక్షణ,నిబద్ధతతో పనిచేసే అధికారులు,సిబ్బందికి ఎప్పటికైనా ప్రత్యేక గుర్తింపు,గౌరవం లభిస్తుందని ఈ సందర్భంగా ఎస్పీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి రెహమాన్ కూడా పాల్గొన్నారు.

## మాధాపురం గ్రామంలో భూభారతి రెవిన్యూ సదస్సు

యాదగిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : తుర్కపల్లి మండలంలోని





మాధాపురం గ్రామంలో భూభారతి రెవిన్యూ సదస్సులో ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఐనాల చైతన్య మహేందర్ రెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూభారతి రైతు చట్టం లో భాగంగా ప్రతీ గ్రామంలో రెవిన్యూ సదస్సులను నిర్వహిస్తున్నది కావున సోమవారం తుర్కపల్లి మండలంలోని మాదాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న రెవిన్యూ సదస్సులో ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఐనాల చైతన్య మహేందర్ రెడ్డి పాల్గొని ఆ గ్రామ ప్రజలు వారి భూ సమస్యలకు సంబందించిన దరఖాస్తులు రెవిన్యూ అధికారులకు ఇస్తున్న తీరును పరిశీలించారు. ఈ దరఖాస్తులను వెంటనే విచారించి వారికి తగిన న్యాయం చేయాలనీ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమం లో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ ఐ లు , రెవెన్యూ సిబ్బంది , మాజీ ప్రజా ప్రతినిధులు , గ్రామ పెద్దలు , రైతులు , తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ



రాజాపేట , ప్రజా స్ఫూర్తి : రాజపేట మండలంలో ఇందిరమ్మ ఇళ్ళ పట్టాలు, కళ్యాణ లక్ష్మీ ,షాధి ముబారక్ చెక్కులు పంపిణీ కార్యక్రమం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య చేతుల మీదుగా సోమవారం జరిగింది. రాజపేటలోని మీనాక్షి ఫంక్షన్ హాల్ లో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో లబ్ధిదారులకు బీర్ల ఐలయ్య అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ప్రభుత్వానికి బీర్ల ఐలయ్యకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పారు.రాజపేట మండలంలో 193 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ చెక్కులను, 275 మంది లబ్ధి దారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను బీర్ల అయిలయ్య పంపిణీ చేసినట్లు తహసిల్దార్ ఇంద్రకర్ అనిత ఎంపీడీవో నాగవేణి లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈశాన్యాలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగే పెంటయ్య గౌడ్, ఆలేరు నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు మీడియా ఇన్చార్జి ఇంజ నరేష్,రాజపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్, నమిల కేదారి గౌడ్, ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిల్వేరు బాలరాజు గౌడ్, మాడోత్ విఠల్ నాయక్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు రంజీ నాయక్, జూకంటి ప్రవీణ్, పాండవుల బసవరాజు గౌడ్, రేణిగుంట గ్రామ శాఖ అధ్యక్షులు బొద్దుల నరేష్, మేడిశెట్టి సురేష్, రాజపేట అధ్యక్షులు ఐరేని నవీన్ కుమార్, పెద్దోళ్ల ప్రభాకర్ తదితరులున్నారు.ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

*** బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్ రెడ్డి**



ఆలేరు, ప్రజాస్ఫూర్తి : పేద ప్రజల కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోది ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్ రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం ఆలేరు లోని ఏఎన్ఆర్ గార్డెన్ లో బిజెపి మండల పట్టణ శాఖ ఆధ్వర్యంలో 11 ఏళ్ల మోది ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులపై ఏర్పాటు చేసిన కార్యశాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి పార్టీ అధికారంలోకి వచ్చాక భారతదేశ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని అన్నారు. గత ప్రభుత్వం ఏనాడు ప్రజా సమస్యలను పట్టించుకోలేదని అన్నారు. మోడీ చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేక కాంగ్రెస్ పార్టీ నాయకులు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయాలని ఆయన అన్నారు. దేశ రాష్ట్ర అభివృద్ధి బిజెపితోనే సాధ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు మండల పార్టీ అధ్యక్షుడు పూజారి కుమారస్వామి గౌడ్ బిజెపి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ నెంబర్ వడ్డెమాన్ నరేందర్, ఓ బి సి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కామిటికారి కృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి తునికి దశరథ , బీజేవైఎం రాష్ట్ర నాయకులు చంద్రమౌళి, మహిళా మోర్చా మండల అధ్యక్షులు శేషత్వం అర్చన ,బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి తీరాల శంకర్, జిల్లా నాయకులు సూతగాని రాజు, మండల ఉపాధ్యక్షులు సురేష్ ,నాయకులు నరసింహారెడ్డి, సుంకరి సృజన్, ఎస్ అమరేందర్, వడ్డేపల్లి కిషన్ గాదే, వాసు, గజరాజుల శంకర్, జి పరశురాములు, వెంకటేష్, కాంద్రజు శ్రీను, సారయ్య కృష్ణమూర్తి, కోల సందీప్ ,కిషోర్, శివ సంతోష్ ,చింతకింది భాస్కర్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాల కు హాజరు కావాలని మాజీ ఎమ్మెల్యే కు ఆహ్వానం



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం డివిజన్ ఉషోదయ కాలనీలో శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ అభయాంజనేయ సహిత శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో దశమ వార్షిక బ్రహ్మోత్సవాల కు ముఖ్య అతిథిగా హాజరు కావాలని సోమవారం ఆలయ కమిటీ సభ్యులు కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు , కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ను ఆలయ కమిటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## కుట్రపూరిత రాజకీయాలకు చెంపపెట్టు

*** సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**



ప్రజాస్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు పై వేసిన అనర్హత పిటిషన్ గౌరవ హై కోర్ట్ డిస్మిస్ చేయడం కుట్రపూరిత రాజకీయాలకు చెంపపెట్టు లాంటిదని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. అనర్హత పిటిషన్ డిస్మిస్పై సోమవారం అయన స్పందిస్తూ ప్రజల నియోజకవర్గ ప్రజలు ఏకపక్షంగా కూనంనేనిని కోరుకున్నారని, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎమ్మెల్యేగా గెలిచినా కూనంనేని అర్హుడు కాదంటూ తప్పుడు కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేసేందుకు ప్రయత్నాలు జరిగాయని అన్నారు. ప్రజల అభిష్టానికి బిన్నంగా దొడ్డిదారిన అందలం ఎక్కాలని కుట్ర చేసిన వ్యక్తులకు కోర్టు గట్టి సమాధానం చెప్పిందని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అడ్డంకులు తొలగిపోయాయని, భవిష్యత్తులో రెట్టింపు ఉత్సహంతో కూనంనేని ప్రజలకు సేవలందిస్తారని, నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి సాదిస్తుందని స్పష్టం చేశారు.

## అమ్మ మాట అంగన్వాడి బాట ను విజయవంతం చేయాలి

*** జిల్లా సంక్షేమ అధికారిని స్వర్ణలత లెనీనా**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఈనెల 10వ తేదీ నుండి 17వ తేదీ వరకు జరగబోయే "అమ్మ మాట అంగనవాడి బాట" కార్యక్రమంలో అంగనవాడి టీచర్ల నుండి సిడిపిఓల వరకు క్షేత్రస్థాయిలో భాగస్వాములై విజయవంతం చేయాలని జిల్లా సంక్షేమ అధికారిని స్వర్ణలత లేని సోమవారం క్షేత్రస్థాయి సిబ్బందితో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో పేర్కొనడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారిని స్వర్ణలత లేనినా మాట్లాడుతూ ముందుగా అంగన్వాడి కేంద్రాలను అహలోదకరమైన వాతావరణంలో ఉండే విధంగా చూసుకొని పెరటి తోటలు పచ్చదనంపై శ్రద్ధ పెట్టి మొదటి రోజు వచ్చే పిల్లల తల్లితండ్రులతో అంగన్వాడి కేంద్రాలలో సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేసుకొని ఫోటో దిగే విధంగా చర్యలు తీసుకోని, కార్పొరేట్ విద్యాసంస్థలకు అతీతంగా విద్యా బోధన అందిస్తున్న విధానం పై తల్లితండ్రులకు అవగాహన కల్పిస్తూ, అంగన్వాడి కేంద్రాల శుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని కోరారు.మూడు సంవత్సరాల పైబడిన పిల్లలను చేర్పించే విధంగా గ్రామ , పట్టణ స్థాయిలో స్వయం సహాయక గ్రూప్ సభ్యులు పిల్లల తల్లితండ్రులచే అవగాహన ర్యాలీలు నిర్వహించాలని, తదుపరి "స్వచ్ అంగనవాడి"లో భాగంగా అంగన్వాడి కేంద్రాలను శుభ్రపరచుకొని అంగన్వాడి కేంద్రానికి వచ్చే చిన్నారులకు పోషక విలు అంగనవాడి కేంద్రాలలో పోషణ వాటికలు ఏర్పాటు చేసి అంగన్వాడి కేంద్రాలకు వచ్చే పిల్లలకు, గర్భిణీలకు, బాలింతలకు పోషకాహార విలువలు పెంపొందించే విధంగా అవగాహన కల్పించాలని, అంగనవాడి కేంద్రాలలో బోధిస్తున్న పూర్వ ప్రాథమిక విద్యపై తల్లితండ్రులకు వివరిస్తూ అదేవిధంగా క్రీడా నైపుణ్యతతో కూడిన విద్యను ఏ విధంగా అనుసరించాలో తెలియపరచాల్సిన మెటీరియల్ను అంగన్వాడి కేంద్రాలలో ఉండే విధంగా చూసుకుంటూ, గ్రామా పట్టణాలలో ఉన్న ప్రతి ఒక్క అంగనవాడి కేంద్రాలలో సాముహిక అక్షరాభ్యాసం నిర్వహించి అట్టి కార్యక్రమానికి పిల్లల యొక్క తల్లితండ్రులు హాజరయ్యే విధంగా చూసుకోవాలని ఈ యొక్క సాముహిక అక్షరాభ్యాసానికి ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించే విధంగా చొరవ తీసుకోవాలని కోరారు. అంగన్వాడి కేంద్రాలలో పిల్లలు ఎవరైతే శారీరకంగా దృఢంగా ఉండి క్రమం తప్పకుండా హాజరవుతూ విద్యాభ్యాసంలో ముందంజలో ఉన్న తల్లితండ్రులకు ప్రోత్సాహక బహుమతులు అందజేయాలని, అంగన్వాడి కేంద్రాలలో మౌలిక సదుపాయాలు అయినటువంటి విద్యుత్ సరఫరా నీటి సరఫరా, ప్రీ స్కూల్ కిట్, ఇప్పటికే సిద్ధంగాఉంచామని, త్రుచా తప్పకుండా అంగన్వాడి కేంద్రాలలో పిల్లల ఎత్తు బరువులు క్రమం తప్పకుండా చూస్తూ వారి యొక్క ఆరోగ్య స్థితిగతులు పై తల్లితండ్రులకు వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అప్లికేషన్లలో నమోదు చేస్తూ పోషణ లోపం లేకుండా చూసే బాధ్యత ప్రతి ఒక్క అంగన్వాడి టీచర్ పై ఉందని తెలిపారు. అదేవిధంగా రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన :ఇందిరమ్మ అమృతం" పథకం రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా మన జిల్లాలో లాంఛనంగా ప్రారంభించడం జరిగిందని ఎవరైతే అంగన్వాడి కేంద్రాలలో 14 నుండి 18 సంవత్సరాల మధ్య నమోదైనటువంటి కిశోర బాలికలకు క్రమం తప్పకుండా అందజేస్తూ రక్తహీనత రహిత తెలంగాణ కోసం పాటుపడాలని కోరారు.గర్భిణీలు బాలింతలు చిన్నారులకు అంగనవాడి కేంద్రాలు అందించే పౌష్టికాహారం విలువలు తెలియజేస్తూ అంగన్వాడీ కేంద్రాలలోని వాటిని వినియోగించుకోవడం వల్ల కలిగే లాభాలు తెలియజేస్తూ, విధిగా కిశోర బాలికలకు అనేమియా బారిన పడకుండా వైద్య సిబ్బంది సహకారంతో రక్త పరీక్షలు నిర్వహించాలని రాష్ట్రంలోనే అత్యధిక ప్రాజెక్టులు కలిగిన జిల్లా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కావున అత్యధికంగా మూడు సంవత్సరాల పైబడిన చిన్నారులందరూ అంగన్వాడి కేంద్రాలు హాజరై విధంగా చొరవ తీసుకొని ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలని కోరారు. అదేవిధంగా 10వ తేదీ నుండి 17వ తేదీ వరకు అంగన్వాడి కేంద్రాలలో నిర్వహించాల్సిన కార్యక్రమ వివరాలు వెల్లడించారు. మొదటి రోజున అంగన్వాడి కేంద్రాలకు వచ్చే పిల్లలు, తల్లితండ్రులు సెల్ఫీలు తీసుకునే విధంగా చొరవ తీసుకోవాలన్నారు. అంగనవాడి కేంద్ర పరిసరాలలో ఇంకుడు గుంతలతో పాటు పోషణ వాటికలు ఏర్పాటు చేయటం, గ్రామ పట్టణ స్థాయిలో ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు పిల్లల తల్లితండ్రులచే ర్యాలీ నిర్వహించడం, "స్వచ్ అంగన్వాడి" లో భాగంగా అంగన్వాడి కేంద్రం పరిశుభ్రంగా ఉంచుకొని మౌలిక సదుపాయాలు అన్ని కల్పించాలని, సాముహిక అక్షరాభ్యాసం నిర్వహించి పూర్వ ప్రాథమిక విద్య పై అవగాహన కల్పించడం, అంగన్వాడి కేంద్రాలలో బోధించే విద్యా విధానంపై తల్లిదండ్రుల అవగాహన కల్పించడం మన లక్ష్యమని తెలిపారు.

# సాంకేతికతను సమగ్రంగా తెలుసుకుంటే వార్తల సేకరణ సులభం

*** మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి**









హైదరాబాద్ , (ప్రజాస్ఫూర్తి) : సాంకేతికతను సమగ్రంగా తెలుసుకుంటే వార్తల సేకరణ సులభం అవుతుందని మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం నాంపల్లి లోని మీడియా అకాడమీ భవనంలో మేడ్చల్ మల్కాజ్గిరి లోని పాత్రికేయులకు రెండు రోజుల పాటు శిక్షణ తరగతుల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక యుగంలో జర్నలిజం చరిత్రాత్మకమైన మార్పులు వస్తున్నాయన్నారు. వార్తల సేకరణలో సామాజిక ప్రభావం వంటి అంశాలు పూర్తిగా కొత్త రూపం దాల్చాయని ఆయన తెలిపారు, పాఠకుల వ్యక్తిగత అభిరుచులకు అనుగుణంగా వార్తలు ఉండాలని, తెలుగు వార్తలను సులువైన భాష లో వ్రాయాలని సూచించారు. ప్రముఖ సంపాదకులు కే శ్రీనివాస్ మాట్లాడుతూ జర్నలిజం గతం వర్తమానం భవిష్యత్తు మీడియా ధోరణులు , ఆధునిక యుగంలో మీడియాలో వస్తున్న మార్పుల గురించి వివరించారు. సోషల్ మీడియా, యూట్యూబ్ లో వస్తున్న వార్తలు క్షణాల్లో ప్రజల్లో వెళ్తున్నాయని తెలిపారు.సీనియర్ పాత్రికేయులు మార్కండేయ మాట్లాడుతూ నూతన టెక్నాలజీని వినియోగించుకొని పాఠకులను ఆకర్షించే విధంగా వార్తలను సేకరించాలని ఆయన వివరించారు. సీనియర్ జర్నలిస్ట్ గోవింద్ రెడ్డి మాట్లాడుతూ నేర వార్తల సేకరణ లో తీసుకోవలసిన జాగ్రత్తలు ,చట్టాలపై అవగాహన ఉండాలని, వార్తలు సేకరించే ముందు నిజనిర్ధారణ చేసుకొని వ్రాయాలని ఆయన సూచించారు, అలాగే నేర వార్తలలో చేయాల్సినవి, చేయకూడనివి అంశాలపై క్లుప్తంగా వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మీడియా అకాడమీ సెక్రటరీ ఎన్. వెంకటేశ్వరరావు, మేనేజర్ శైలేశ్వర్ రెడ్డి , మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

## మట్టి అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవు

*** మైనింగ్ ఏడి క్రాంతి కుమార్**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: మట్టి అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని మైనింగ్ ఏడి క్రాంతి కుమార్ హెచ్చరించారు. ముస్తాబాద్ మండలంలోని పోతుగల్ గ్రామ శివారులో గల పట్టా భూమిలో అక్రమంగా మట్టి తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఆయన విచారణ చేపట్టారు. అక్రమంగా మట్టి తరలిస్తున్న హిటాచి వాహనాన్ని సీజ్ చేశారు. ఎవరైనా వ్యవసాయ భూముల్లోని అక్రమంగా మట్టిని తరలిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు. అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై తదుపరి చర్యలు మైనింగ్ శాఖ తీసుకుంటుందని తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ రఘు ఉన్నారు.

## వందలాది మంది ఎదురుచూస్తున్నారు.. సర్కార్ ఎదుట ఎమ్మెల్సీ కవిత కీలక డిమాండ్



సింగరేణిలో మారు పేర్ల (అలియాస్ నేమ్స్)తో కార్మికులుగా పనిచేసి డిపెండెంట్ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న బాధితులను ఆదుకోవాలని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో సింగరేణి జాగృతి నాయకులు, అలియాస్ నేమ్స్ డిపెండెంట్ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న వారితో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. సంస్థలో 30 ఏళ్లకు పైగా సేవ చేసిన కార్మికుల వారసులకు ఉద్యోగాలు ఇవ్వకుండా వేధింపులకు గురిచేయడం అన్యాయమన్నారు. తండ్రులు అలియాస్ నేమ్స్‌తో పనిచేస్తే వారసులకు రెండు ఇంటి పేర్లు ఉన్నాయనే కారణంతో ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారు. అలియాస్ నేమ్స్ డిపెండెంట్ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న వారిని విజిలెన్స్ విభాగం ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెడుతున్నదని అన్నారు. డిపెండెంట్ ఉద్యోగాల కోసం వందలాది మంది ఎదురుచూస్తున్నారని తెలిపారు. యాజమాన్యం మానవతా దృక్పథంతో పరిష్కరించాలని కోరారు. సింగరేణి యాజమాన్యం, జాతీయ కార్మిక సంఘాలు లేబర్ కమిషనర్ వద్ద చేసుకున్న ఒప్పందం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్సీ కవిత సూచన మేరకు సింగరేణి జాగృతి నాయకులు సంస్థ జనరల్ మేనేజర్ కోఆర్డినేషన్ సుభానిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశంలో తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీనచారి, తెలంగాణ జాగృతి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ నరేన్ అప్పల, టీబీజీకేఎస్ కేంద్ర కోశాధికారి వెంకట్, సింగరేణి జాగృతి నాయకులు నరేష్ నేత, భువనచంద్ర, అనిల్ సందీప్ గౌడ్, సునీల్, శ్రీకాంత్, మారుపేరు బాధితులు పాల్గొన్నారు.

## లిటిల్ చాలెంజర్స్ సూపర్ నాకౌట్స్ ట్రోఫీ – 2025

*** అండర్ 12, 14, 16 క్రికెట్ టోర్నమెంట్**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: సమ్మర్ క్యాంప్ ముగిసిన సందర్భంగా అండర్ 12, 14, 16 క్రికెట్ టోర్నమెంట్ ఈనెల 8, 9, 10, 11 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.హేమచంద్రపురం లోని బి కే సి ఏ గ్రౌండ్ లో కొత్తగూడెం డిఎస్పి రెహమాన్ టోర్నమెంట్ ప్రారంభించినారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లో క్రికెట్ సమ్మర్ క్యాంపు ముగిసిన నేపథ్యంలో బాల, బాలికలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యువజన క్రీడల అధికారి పరందామ రెడ్డి నేతృత్వంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లక్ష్మీదేవిపల్లి మండలం లోని హేమచంద్రపురంలో గల బీకేసీఏ గ్రౌండ్ లో లిటిల్ చాలెంజర్స్ సూపర్ నాకౌట్స్ ట్రోఫీ - 2025 ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్ ని కొత్తగూడెం డిఎస్పి షేక్ అబ్దుల్ రెహమాన్ ప్రారంభించడం జరిగింది. తొలుత వేదమంత్రాలతో క్రికెట్ పిచ్ మీద పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన కొత్తగూడెం డిఎస్పి అబ్దుల్ రెహమాన్ మాట్లాడుతూ.. బాలబాలికల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలని, నేటి బాలలే రేపటి పౌరులని అన్నారు. ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్ని క్రీడా రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, క్రీడాకారులకు కావాల్సిన మరింత మౌలిక సదుపాయాలను అందిస్తే వారి ప్రతిభను వెలికి తీయవచ్చని అన్నారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడా రంగాల్లో ప్రోత్సహించి ఉన్నత శిఖరాలను అధిరోహించేలా బాధ్యత వహించాలని సూచించారు. ఇటీవల కాలంలో క్రికెట్ కి మరింత క్రేజ్ పెరుగుతుందని ఇందులో భాగంగా చిన్నారులకు ఒక ప్రత్యేకమైన టోర్నమెంట్ నిర్వహించాలనే ఆలోచన రావడం హర్షనీయమని అన్నారు. ఈ టోర్నమెంట్ నిర్వహణకు శ్రీకారం చుట్టిన క్రికెట్ కోచ్ పంతంగి సాయి నిరంజన్ ను ఆయన అభినందించారు. అనంతరం టాస్ వేసి మొదటి మ్యాచ్ ని ప్రారంభించారు. నీ టోర్నమెంట్ లో భాగంగా రెడ్ స్మాషర్స్ వర్సెస్ విక్టరీ వైలెట్స్ మధ్య హోరాహోరీగా పోరు జరిగింది. రెండు జట్ల మధ్య జరిగిన ఉత్కంఠ భరితమైన మ్యాచ్ లో విక్టరీ వైలెట్ జట్టు విజయాన్ని సాధించింది. అనంతరం జరిగిన 2వ మ్యాచ్ ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ బి.ఎస్.రావు టాస్ వేసి ప్రారంభించారు. ఈ టోర్నమెంట్ కి లక్ష్మీదేవిపల్లి మండల ఎస్సై రమణారెడ్డి, డాక్టర్ బి.ఎస్.రావులు క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతులను ప్రకటించారు. ఈ టోర్నమెంట్లో మొత్తం 12 టీంలు పాల్గొనలు ఉన్నాయి. ఇందులో 6-6 టీములను గ్రూప్ - ఏ, గ్రూపు - బి గా విభజించి మ్యాచ్లను నిర్వహించడం జరుగుతుంది. ఈ టీములలో అండర్ -10, అండర్-14, అండర్ -19 జట్ల వారీగా పోటీలను ఎంపిక చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ముప్పారపు కరుణాకర్, లక్ష్మీదేవిపల్లి మండలం ఎస్సైలు జి రమణారెడ్డి, విజయసింహా రెడ్డి, ఆర్ఎస్ఐలు జగన్, ఓం ప్రకాష్, అసిస్టెంట్ కోచ్ లు మార్గం నరేందర్, బోయిని ప్రసాద్, కే లోకేష్, పదిరె నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల వంట కార్మికుల పెండింగ్ బిల్లులు, వేతనాలు.. వెంటనే విడుదల చేయాలి

*** ఏఐటీయూసీ రాష్ట కార్యదర్శి నరాటి ప్రసాద్ డిమాండ్.**




ప్రజా స్ఫూర్తి ,భద్రాద్రి కొత్తగూడెం: మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యాశాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈ ధర్నా లో పాల్గొన్న ఏఐటీయూసీ రాష్ట కార్యదర్శి నరాటి ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభానికి రెండు రోజులే ఉంది, కానీ వంట కార్మికులకు గత సంవత్సరం వంట బిల్లులు, వేతనాలు, కోడి గుడ్ల బిల్లులు పెండింగ్ లోనే ఉన్నాయి మరి ఇప్పుడు వంటలు ఎలా చేయాలో అధికారులు ఆలోచన చేయాలని కోరారు, అలాగే 2023 అక్టోబరు నెల నుండి అల్పాహారం బిల్లులు కూడా పెండింగ్ లోనే ఉన్నాయి అన్నారు దానితో పాటు రాగి జావ తయారు చేయడానికి గ్యాస్ సిలిండర్ల ఖర్చు చాలా అవుతుంది ఎలాంటి పారితోషికం లేకుండా తయారు చేయడం ఇబ్బంది కనుక రాగి జావ కు ప్రతీ విద్యార్థికి రూ.2 లు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రూ 10 వేల వేతనం వెంటనే చెల్లించాలని డిమాండ్ పెండింగ్ బిల్లులు వేతనాలు కోడి గుడ్ల బిల్లులు అన్నీ పాఠశాలలు ప్రారంభానికి ముందే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మద్యాన భోజన కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ లక్ష్మి, స్వప్న,ఎండూరి ప్రభావతి. లక్ష్మి,నర్సమ్మ, సమ్మక్క,తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్మెంట్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా అలీంకో వారి సౌజన్యంతో సామాజిక అధికారిత శివిర్ దివ్యాంగుల సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమం తెలంగాణ స్కూల్ పాత కొత్తగూడెం లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లేనినా అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్ జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ దివ్యాంగులు వారి తెలివితేటలతో, వారి సామర్థ్యాన్ని బట్టి పనులు చేసుకోని అన్ని రంగాలలో రాణించాలని, వారి దినచర్యలో భాగంగా ఈ సహాయ ఉపకరణాలు ఎంతో ఉపయోగపడతాయని,ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందించాలని అన్నారు. గత అక్టోబర్ నెలలో జిల్లాలోని గుండాల, భద్రాచలం, అశ్వరావుపేట, ఐ.డి.ఓ.సి. పాల్వంచ ప్రదేశాలలో దివ్యాంగులకు సహాయ ఉపకరణాల ఎంపిక శిబిరము నిర్వహించడం జరిగింది. ఎంపికైన 440 మంది దివ్యాంగులకు 1057 సహాయ ఉపకరణాలు(విలువ 1.11 కోట్లు) పంపిణీ చేయడం జరిగింది. లబ్ధిదారులకు బ్యాటరీ ట్రై సైకిల్స్, వీల్ చైర్స్, ట్రై సైకిల్స్, వినికిడి యంత్రాలు, సిపి చైర్స్, చంక కర్రలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్పీ సీఈవో బి.నాగ లక్ష్మి , డిఎంహెచ్వో భాస్కర్ నాయక్, సిడిపిఓ పద్మశ్రీ, ఐ.ఈ.డి శ్రీరామ్, టి.వి. పి.ఎస్. అధ్యక్షుడు సతీష్, డి.సి.పి.ఓ.హరి కుమారి, సఖి అడ్మిన్ శుభ శ్రీ, హబ్ కోఆర్డినేటర్ రూప, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సందీప్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, కార్యాలయ సిబ్బంది వరప్రసాద్, నరేష్, ప్రవీణ్, అంగన్వాడి టీచర్లు మరియు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రికి తుమ్మల కీలక రిక్వెస్ట్...



రాష్ట్రంలో 3,300 ఎకరాల కొబ్బరి సాగు జరుగుతుందని భద్రాద్రి కొత్తగూడెంలో కొబ్బరి అభివృద్ధి బోర్డు ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ను కోరారు. సోమవారం తెలంగాణ పర్యటనకు వచ్చిన ఆయనకు లేఖలో అభ్యర్థించారు. భద్రాద్రి కొత్తగూడెం 1,757 ఎకరాలు, ఖమ్మంలో 696 ఎకరాలు సాగును చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని మిగతా జిల్లాలలో కూడా కొబ్బరిసాగును విస్తరించేందుకు అవకాశాలు ఉన్నాయని, గతంలో హైదరాబాద్ కార్యాలయంగా కొబ్బరిబోర్డు కార్యాలయం ఉండేదని, కాని విభజన అనంతరం అది విజయవాడకు తరలించబడిందన్నారు. దీంతో రాష్ట్ర కొబ్బరి రైతులు సకాలంలో సేవలు అందుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమం దృష్ట్యా ఆశ్వారావుపేట కానీ దమ్మపేటలో పూర్తిస్థాయిలో కొబ్బరి అభివృద్ధి బోర్డు ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఆయిల్ పామ్ సాగు కోసం కేంద్రం చేపట్టిన నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ ఆయిల్ పామ్ కింద రాష్ట్రం 1.25 లక్షల హెక్టార్లకు లక్ష్యంగా 75 వేల హెక్టార్లలో సాగు చేపట్టి దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించడానికి నాణ్యమైన ఆయిల్ పామ్ విత్తనాలు కీలకమని, దేశీయంగా సరిపడా విత్తనాలు అందుబాటులో లేవన్నారు. ఆయిల్ పామ్ కంపెనీలు విదేశాలనుండి విత్తనాలను దిగుమతి చేసుకుంటున్నాయన్నారు. నాణ్యమైన విత్తనాలను అందించే సరఫరాదారుల సమాచారం లేనందున, కంపెనీలు కేవలం ఐదారుగురు సరఫరదారులపైనే ఆధారపడుతున్నారని తెలిపారు. నాణ్యమైన విత్తనాల సరఫరాదారులను గుర్తించి ఎంప్యానల్ చేస్తే రైతులకు నష్టాలు రాకుండా ఆయిల్ పామ్ అభివృద్ధిని వేగవంతం చేయవచ్చన్నారు.

## వికసిత భారత్ సాధించడంలో జియోసైన్సెస్ పాత్ర కీలకం

**: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**



ఖనిజ అన్వేషణలో శాస్త్ర, సుస్థిరత, సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషించే కొత్త శకంలోకి భారత్ ప్రవేశిస్తోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. వాతావరణ మార్పులు, పట్టణీకరణ, విపత్తుల నివారణ వంటి సవాళ్లను ఎదుర్కోవడానికి వినూత్న సాధనాలను అందించడం ద్వారా వికసిత భారత్ లక్ష్యాలను సాధించడంలో భూభౌతికశాస్త్రం పాత్ర కీలకమని వెల్లడించారు. సోమవారం బండ్లగూడ నాగోల్ లోని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ట్రైనింగ్ ఇన్ స్టిట్యూట్ లో నెక్స్ట్ జనరేషన్ జియోఫిజిక్స్, అన్ లాక్ ఎర్త్ హిడెన్ ట్రెజర్స్ సదస్సు ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సహజ వనరుల శాస్త్రీయ అన్వేషణలో భారత్ దీర్ఘకాలిక నిబద్ధతకు ఈ మైలురాయిని నిలిచిందన్నారు. కొండచరియలు విరిగిపడడాన్ని ముందుగా సూచించే జాతీయ కేంద్రం ఏర్పాటు, విపత్తు సంసిద్ధతను మెరుగుపరచడానికి ఇటలీతో ఇటీవలి అవగాహన ఒప్పందం సహా భారత్ సాధించిన ప్రధాన పురోగతి వివరించారు. పర్యవేక్షణ వ్యవస్థలను విస్తరించాలని, ముందస్తు హెచ్చరికలకు సంబంధించి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసరించాలని పిలుపునిచ్చారు. ప్రపంచ విద్య, పరిశోధనల్లో పెరుగుతున్న భారత్ ప్రాబల్యం పెరిగిందని, క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ 2025 లో భారతీయ సంస్థల పెరుగుదల 318 శాతం ఉన్నట్టు పేర్కొన్నారు. ఐఐటీ సీట్లను రెట్టింపు చేయడం, అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేయడం సైన్స్ అభివృద్ధి పట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శమన్నారు.

*** భూకంప కచ్చితత్వం కోసం సైంటిస్టులు సాంకేతికత అందుకోవాలి :**

నిక్షిప్త ఖనిజ వనరులను అంచనా వేయడం, భూకంప సమాచారం మరింత కచ్చితత్వంతో వివరించడం సహా మెరుగైన అన్వేషణ కోసం కృత్రిమ మేధ (ఏఐ), క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని జియో సైంటిస్టులను కోరారు. రూ.10,300 కోట్లతో చేపట్టిన ఇండియా ఏఐ మిషన్, రూ.6 వేల కోట్లతో చేపట్టిన నేషనల్ క్వాంటమ్ మిషన్ వంటి ప్రతిష్టాత్మక కార్యక్రమాల గురించి వివరించారు. కృత్రిమ మేధ ఆధారిత, శుభ్రమైన, సమర్థవంతమైన అన్వేషణ పద్ధతుల ద్వారా లిథియం, కోబాల్ట్ వంటి కీలక ఖనిజాల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడాన్ని బట్టి భారత ఆర్థిక భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు.

# త్వరలో బాలభరోసా పథకం ప్రారంభం: మంత్రి సీతక్క

హైదరాబాద్: త్వరలో బాలభరోసా పథకం ప్రారంభించి.. ఐదేళ్లలోపు పిల్లలకు అవసరమైన శస్త్రచికిత్సలు చేయిస్తామని తెలంగాణ మంత్రి సీతక్క తెలిపారు. సోమవారం ఆమె కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. మహిళా సంఘాల సోలార్ ప్లాంట్లను అక్టోబర్ 2న ప్రారంభించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 22 జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాలు నవంబర్‌లోపు నిర్మించాలని చెప్పారు. పాఠశాలలు ప్రారంభం రోజే





విద్యార్థులకు యూనిఫాంలను పంపిణీ చేయాలన్నారు. కొత్తగా వెయ్యి అంగన్వాడీ భవనాలు నిర్మిస్తామని తెలిపారు. ప్రైవేటు ప్లేస్కూళ్లకు దీటుగా అంగన్వాడీలను తీర్చిదిద్దాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## టీజీఎస్ఆర్టీసీకి ప్రభుత్వం రూ.6,088 కోట్లు చెల్లించింది: భట్టి విక్రమార్క

సూర్యపేట: తెలంగాణ ఆర్టీసీలో ఇప్పటి వరకు ప్రయాణించిన మహిళలకు రూ.182 కోట్ల జీరో టికెట్లు జారీ చేసినట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. సూర్యాపేట ఆర్టీసీ డిపోలో ఎలక్ట్రిక్ బస్సులను ఆయన ప్రారంభించారు. అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ''మహాలక్ష్మి పేరిటి ఉచిత ప్రయాణంతో కొందరు ఆందోళన చెందారు. మహిళలు ఉచిత ప్రయాణం చేసినా ప్రభుత్వం ఆర్టీసీకి డబ్బులు చెల్లించింది. ఇప్పటి వరకు ఆర్టీసీకి రూ. 6,088 కోట్లు చెల్లించింది. బస్సులు పూర్తి సామర్థ్యంతో నడుస్తున్నందునే ఆర్టీసీ



నిలదొక్కుకుంటోంది''అని తెలిపారు. ఈవీ బస్సుల ప్రారంభోత్సవంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, శంకర్ నాయక్, అద్దంకి దయాకర్, ఉత్తమ్ పద్మావతి, మందుల సామేల్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో..
## గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఆన్ మిల్లెట్స్‌కు శంకుస్థాపన

హైదరాబాద్: కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ సోమవారం హైదరాబాద్‌లో పర్యటించారు. నగరంలోని ఐసీఏఆర్‌భారత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ ప్రాంగణంలో గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ మిల్లెట్స్ పేరుతో ఏర్పాటు కానున్న సంస్థకు శంకుస్థాపన చేశారు. ఈ సంస్థ సిరిధాన్యాల పరిశోధన, అభివృద్ధి శిక్షణ, ప్రాచుర్యం కల్పించే దిశగా కీలక మైలురాయిగా నిలుస్తుందని శివరాజ్ సింగ్ అభిప్రాయపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా మిల్లెట్ల ప్రాముఖ్యతను పెంపొందించేందుకు ఇది మార్గదర్శకంగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయశాఖ సహాయమంత్రి భగీరథ్ చౌదరి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, వ్యవసాయ పరిశోధకులు, శాస్త్రవేత్తలు, రైతులు ఇతర




ప్రముఖులు పాల్గొన్నారు.

* **తెలంగాణలో కొబ్బరి అభివృద్ధి బోర్డు ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయాలి: తుమ్మల**

హైదరాబాద్‌లో పర్యటిస్తున్న కేంద్రమంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, భగీరథ్ చౌదరిని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి కొన్ని అభ్యర్థనలతో కూడిన లేఖను వారికి అందించారు. ''కొబ్బరి అభివృద్ధి బోర్డు ప్రాంతీయ కార్యాలయాన్ని రాష్ట్రంలో నెలకొల్పాలి. ఆయిల్‌పామ్ రైతులకు గెలల కనిష్ఠ మద్దతు ధర రూ.25వేలుగా నిర్ణయించాలి. ఆయిల్‌పామ్ దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయాన్ని పునఃసమీక్షించాలి. హార్టికల్చర్ యూనివర్సిటీకి నిధులు మంజూరు చేయాలి'' అని లేఖలో విజ్ఞప్తి చేశారు.

## బస్‌పాస్ ఛార్జీలు పెంచిన తెలంగాణ ఆర్టీసీ

హైదరాబాద్: తెలంగాణ ఆర్టీసీ బస్‌పాస్ ఛార్జీలను పెంచింది. సాధారణ ప్రజలతో పాటు, స్టూడెంట్ పాస్ ధరలను పెంచింది. నేటి నుంచి కొత్త బస్‌పాస్ ఛార్జీలు అమల్లోకి వచ్చాయి. 20 శాతానికి పైగా బస్‌పాస్ రేట్లను పెంచారు. రూ.1,150 ఉన్న ఆర్డినరీ పాస్ ధరను రూ.1,400కు పెంచారు. రూ.1,300 ఉన్న మెట్రో ఎక్స్‌ప్రెస్ పాస్ ధరను రూ.1,600కు పెంచారు. రూ.1,450 ఉన్న మెట్రో డీలక్స్ పాస్‌ను రూ.1,800కు



పెంచారు. గ్రేటర్ హైదరాబాద్, గ్రీన్ మెట్రో ఏసీ పాస్ ధరలను ఆర్టీసీ పెంచింది.

## ఓబుళాపురం మైనింగ్ కేసు..
# దోషుల పిటిషన్లపై విచారణ వాయిదా

హైదరాబాద్: ఓబుళాపురం మైనింగ్ కేసుపై తెలంగాణ హైకోర్టు విచారణ జరిపింది. తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. ఓఎంసీ కేసులో సీబీఐ కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దోషులు గాలి జనార్దన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాజగోపాల్, అలీఖాన్ వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. సీబీఐ కోర్టు తీర్పు యాంత్రికంగా ఉందని అందులో పేర్కొన్నారు. బెయిల్ మంజూరు చేయాలని కోరారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోకుండానే సీబీఐ కోర్టు తీర్పు వెలువరించిందని చెప్పారు. కేసు విచారణ సందర్భంలో గాలి



జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి మూడున్నరేళ్ల పాటు జైలు శిక్ష అనుభవించినట్లు వారి తరపు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. నేరాలకు పాల్పడినందుకే సీబీఐ కోర్టు శిక్ష విధించిందని సీబీఐ తరఫు న్యాయవాది చెప్పారు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

## శాఖల కేటాయింపుపై మల్లగుల్లాలు..
## అధిష్ఠానంతో సీఎం సంప్రదింపులు



హైదరాబాద్: తెలంగాణ మంత్రివర్గ విస్తరణ పూర్తయిన నేపథ్యంలో శాఖల కేటాయింపుపై చర్చ ఊపందుకుంది. దీనిపై అధిష్ఠానంతో చర్చించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి మరికాసేపట్లో ఢిల్లీ చేరుకోనున్నారు. మంత్రుల శాఖల పునర్ వ్యవస్థీకరణపై అధిష్ఠానంతో చర్చించనున్నారు. మంత్రుల శాఖల్లో పెద్ద మొత్తంలో మార్పులు, చేర్పులు జరగనున్నట్లు పార్టీలో చర్చ జరుగుతోంది. ఆర్థిక, పౌర సరఫరాలశాఖ మంత్రుల మార్పుపై ఏఐసీసీ అధిష్ఠానంతో సీఎం చర్చించనున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్, విద్యాశాఖ, ఇతర శాఖల కేటాయింపులపైనా చర్చించే అవకాశముంది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కీలకమైన హోంశాఖ ఇచ్చే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. శ్రీధర్‌బాబుకు ఐటీతోపాటు ఇతర శాఖలు కేటాయించే అవకాశముంది.

## మహారాష్ట్ర, సీడబ్ల్యూసీ అభ్యంతరాల వల్లే కాళేశ్వరం రీ డిజైన్ చేశాం: హరీశ్‌రావు

హైదరాబాద్: కాళేశ్వరం కమిషన్ ఎదుట మాజీ మంత్రి హరీశ్‌రావు విచారణ ముగిసింది. దాదాపు 40 నిమిషాల పాటు ఆయన్ని జస్టిస్ పీసీ ఘోష్ ప్రశ్నించారు. ప్రాజెక్టు రీడిజైనింగ్ కారణాలను హరీశ్‌రావు ఆయనకు వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు లేఅవుట్‌ను చూపించి వివరణ ఇచ్చారు. మహారాష్ట్ర, సీడబ్ల్యూసీ అభ్యంతరాల వల్లే రీడిజైనింగ్ చేసినట్లు చెప్పారు. తమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత సమస్య వల్ల రీడిజైనింగ్ చేసినట్లు తెలిపారు. వాప్కోస్ ద్వారా సర్వే చేయించిన తర్వాతే ప్రాజెక్టు స్థలం మార్చినట్లు కమిషన్‌కు వివరించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గురించి జస్టిస్ పీసీ ఘోష్ ప్రశ్నించగా.. అన్ని ఆనకట్టల నిర్మాణానికి మంత్రివర్గ ఆమోదం ఉందని హరీశ్‌రావు తెలిపారు. ఇంజినీర్ల సూచన మేరకే అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మార్పు జరిగిందన్నారు. స్థలాల మార్పు గతంలోనూ కొన్ని ప్రాజెక్టుల విషయంలో జరిగిందని గుర్తు చేశారు. మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లికి నేరుగా నీరు తరలించవద్దని విశ్రాంత



ఇంజినీర్లు చెప్పారన్న హరీశ్‌రావు.. వారి సూచన మేరకే స్థలం మార్చినట్లు తెలిపారు. ప్రాజెక్టుకు రుణ సేకరణ కోసమే కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పాటు చేశామని, మంత్రి వర్గ ఆమోదం, ప్రభుత్వ గ్యారెంటీతోనే కార్పొరేషన్ ఏర్పాటు జరిగిందని కమిషన్‌కు వివరించారు. కేంద్రప్రభుత్వ సంస్థలు, బ్యాంకుల నుంచే రుణాలు తీసుకున్నట్లు తెలిపారు. కార్పొరేషన్ నుంచి కాకుండా బడ్జెట్ నుంచి నిధులు ఎందుకు కేటాయించారని పీసీ ఘోష్ ప్రశ్నించారు. జలాశయాల నుంచి ఎత్తిపోసిన నీటి వివరాలను అడిగారు. ఆనకట్టల్లో నీరు నిల్వ చేయాలని ఎవరు ఆదేశించారని ప్రశ్నించగా.. ప్రాజెక్టుల్లో నీటి నిల్వ ఇంజినీర్లు చూసుకునే అంశమని చెప్పారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని హరీశ్‌రావు వివరించారు.

**స్వయంగా కేసీఆర్ వెళ్లి అడిగినా..**

''కమిషన్ అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానమిచ్చాను. అన్ని ఆధారాలు సమర్పించా. తమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు ఎందుకు మార్చారని చాలా సేపు ప్రశ్నించారు. తమ్మిడిహట్టి వద్దే కట్టడానికి అన్ని ప్రయత్నాలు చేశామని చెప్పాను. దీనిపై అనాడే అప్పటి మహారాష్ట్ర కాంగ్రెస్ మంత్రిని కోరాం. మీకు మీరుగా నిర్ణయించుకొని పనులు ప్రారంభిస్తే ఖర్చు వృథాగా మారే అవకాశం ఉందని చెప్పారు. తెలంగాణ, మహారాష్ట్ర మధ్య ఐదారు సమావేశాలు జరిగాయి. కేసీఆరే స్వయంగా మహారాష్ట్ర వెళ్లి.. సీఎం ఫడణవీస్‌కు చెప్పే ప్రయత్నం చేశారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ ప్రభుత్వం పోయి.. భాజపా ప్రభుత్వం వస్తే.. మళ్లీ సంప్రదించాం. తమ్మిడిహట్టి వద్ద అనుమతించాలని.. ఎంత నష్టపరిహారమైనా ఇస్తామని స్పష్టంగా చెప్పాం. ఏడేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఒప్పుకోనప్పుడు మేమెలా ఒప్పుకుంటామని మహారాష్ట్ర సీఎం చెప్పారు. ఏడేళ్లు మహారాష్ట్ర, ఢిల్లీ, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నా తమ్మిడి హట్టి వద్ద బ్యారేజ్ ఒప్పించడంతో తీవ్రంగా విఫలమయ్యారు.

## పాడి కౌశిక్‌రెడ్డిపై కేసును కొట్టేసేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్: భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై నమోదైన కేసును కొట్టేసేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. కమలాపురం పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసును కొట్టేయాలంటూ కౌశిక్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. 188 సెక్షన్‌ను కొట్టేసింది. పోలీసులు నమోదు చేసిన మిగతా సెక్షన్లలో విచారణ ఎదుర్కోవాల్సిందేనని ఆదేశించింది. 2023లో అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో తనను గెలిపించకుంటే కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటానని కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారు. దీనిపై నోడల్ అధికారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలపై



ప్రస్తుతం నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది. ఇప్పటికే దీనిపై కమలాపురం పోలీసులు అభియోగపత్రం దాఖలు చేశారు.

# తొక్కిసలాట ఘటన నుంచి పాఠాలు నేర్చుకున్నాం: డీకే శివకుమార్

దిల్లీ: ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయోత్సవం వేళ బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాట పెను విషాదం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మరోసారి స్పందించారు. ఈ ఘటనతో రాష్ట్రం ఎన్నో పాఠాలు నేర్చుకుందని అన్నారు. దిల్లీలో మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌తో సమావేశం పూర్తయిన అనంతరం డీకే మీడియాతో మాట్లాడారు. "తొక్కిసలాట ఘటనతో రాష్ట్రం ఎన్నో పాఠాలు నేర్చుకుంది. ఇకపై ఇలాంటి తప్పిదాలు జరగకుండా సరైన ప్రణాళికలు రూపొందిస్తాం. బహిరంగ కార్యక్రమాల నిర్వహణ విషయంలో ఓ చట్టాన్ని తీసుకురావాలని భావిస్తున్నాం"



అని డీకే పేర్కొన్నారు. ఈ ఘటనకు కాంగ్రెస్ ప్రభుత్వం కారణమంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై ఆయన స్పందించారు. కాగా.. ఆర్సీబీ విజయోత్సవాల వేళ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట ఘటనలో పెను ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. పలువురికి తీవ్ర గాయాలైన సంగతి తెలిసిందే. ప్రతిపక్షాలు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శల బాణాలు ఎక్కుపెడుతున్నాయి. మరోవైపు, ఆర్సీబీ, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ డీఎన్ఏ ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్స్, కర్ణాటక క్రికెట్ అసోసియేషన్(కేఎస్‌సీఏ) సహా తొక్కిసలాటతో సంబంధం ఉన్న పలువురిపై కేసులు నమోదయ్యాయి.

## హనీమూన్ హత్య కేసు.. భర్త తలపై తీవ్ర గాయాలు..!

**: పోస్టుమార్టం నివేదిక వెల్లడి**



హనీమూన్ కోసం మేఘాలయాకు వెళ్లి హత్యకు గురైన రాజా రఘువంశీ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తయింది. దీనికి సంబంధించిన నివేదిక తాజాగా అందింది. అతడి తలకు బలమైన గాయాలున్నట్లు శవపరీక్షలో తేలిందని మీడియా కథనాలు తెలిపాయి. మే 11న రాజా రఘువంశీతో సోనమ్‌కి వివాహం జరగ్గా.. 20న హనీమూన్ కోసం ఈ నవ దంపతులు మేఘాలయాకు వెళ్లారు. అయితే, ఈ జంట మే 22న ఓ ద్విచక్ర వాహనాన్ని అద్దెకు తీసుకొని మౌలాకియాత్ అనే గ్రామానికి చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. ద్విచక్ర వాహనాన్ని అక్కడ పార్క్ చేసి అక్కడే ఉన్న ప్రసిద్ధిగాంచిన 'లివింగ్ రూట్ వంతెన'ను చూసేందుకు వెళ్లారని తెలిపారు. ఆ తర్వాత నుంచి వీరి ఆచూకీ తెలియరాలేదు. అదృశ్యమైన 11 రోజుల తర్వాత రఘువంశీ మృతదేహాన్ని సోహ్రాలోని ఓ జలపాతం సమీపంలో లోతైన లోయలో పోలీసులు గుర్తించారు. అతడి శరీరంపై కత్తి గాయాలు ఉండటంతో పోలీసులు హత్యగా అనుమానించారు. అతడి తలకు బలమైన గాయాలు, శరీరంపై కత్తి గాయాలు అయినట్లు శవపరీక్షలో తాజాగా తేలింది. ఈ క్రమంలోనే కన్పించకుండా పోయిన సోనమ్‌ను ఉత్తరప్రదేశ్‌లోని గాజీపుర్‌లో అదుపులోకి తీసుకున్నారు. తన భర్తను తాను హత్య చేయలేదని.. తనను కిడ్నాప్ చేశారని ఆమె తెలిపినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.

## థానే ప్రమాదం: ఇక లోకల్ ట్రైన్స్‌కు ఆటోమేటిక్ డోర్స్

ముంబయి: మహారాష్ట్రలోని థానే ప్రమాద ఘటన నేపథ్యంలో ఇకపై లోకల్ ట్రైన్స్‌కూ ఆటోమేటిక్ డోర్స్ బిగించాలని రైల్వేశాఖ నిర్ణయించింది. థానేలో జరిగిన ఘటన పునరావృతం కాకుండా ఉండేందుకు ఈ చర్యలకు ఉపక్రమించింది. ప్రస్తుతం ఉన్న రైళ్లతో పాటు కొత్త రైళ్లకూ ఈ తరహా డోర్లు బిగించనున్నట్లు రైల్వే అధికారి ఒకరు తెలిపారు. థానే లోకల్ ట్రైన్‌లో ప్రయాణిస్తున్న ప్రయాణికులు జారిపడి ఐదుగురు మృత్యువాతపడగా.. పలువురు గాయపడిన సంగతి తెలిసిందే. ముంబయి సబర్బన్ ప్రాంతంలో నడిచే అన్ని రైళ్లకూ ఆటోమేటిక్ డోర్లు ఏర్పాటు



చేయాలని రైల్వే శాఖ నిర్ణయించిందని రైల్వే బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు. ప్రయాణికుల భద్రతే రైల్వే ప్రథమ ప్రాధాన్యం అని పేర్కొన్నారు. ఫుట్‌బోర్డుపై ప్రయాణిస్తున్న ప్రయాణికుల బ్యాగులు పరస్పరం తాకడంతో ఈ ప్రమాదం జరిగినట్లు రైల్వే అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఘటనపై రైల్వే యంత్రాంగం దర్యాప్తు చేస్తోందని సీఎం దేవేంద్ర ఫడణవీస్ తెలిపారు.

## షాకింగ్‌లా ఉంది.. నమ్మలేకపోయా
## 'హనీమూన్ మర్డర్'పై డిప్యూటీ సీఎం ప్రెస్టోన్



షిల్లాంగ్: హనీమూన్‌కు వచ్చిన జంట అదృశ్యం కేసులో భర్తను నవవధువే హత్య చేయించిందన్న వార్త తనను షాకింగ్‌కు గురిచేసిందని మేఘాలయ డిప్యూటీ సీఎం ప్రెస్టోన్ త్యాన్‌సాంగ్ అన్నారు. పర్యాటకులకు తమ రాష్ట్రం సురక్షితమైన ప్రాంతమని చెప్పారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన రాజా రఘువంశీ, తన భార్య సోనమ్‌తో కలిసి హనీమూన్ కోసం మేఘాలయ వెళ్లి అదృశ్యమైన ఘటన తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో భర్త మృతదేహం జూన్ 4న బయటపడగా.. భార్య కోసం ముమ్మరంగా గాలిస్తున్న వేళ ఆమె యూపీ పోలీసుల ఎదుట లొంగిపోవడంతో అసలు విషయం బయటపడింది. సోనమ్ తన ప్రియుడు రాజ్ కుష్వాహాతో కలిసి సుపారీ గ్యాంగ్‌తో భర్తను చంపించినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. దీంతో పోలీసులు సోనమ్ ప్రియుడితో పాటు మరో ముగ్గురిని అరెస్టు చేశారు. ఈ ఘటనపై మేఘాలయ డిప్యూటీ సీఎం స్పందించారు. 'ఈ ఘటన గురించి తెలిసి దిగ్భ్రాంతికి గురయ్యాను. ఇది నాకు నమ్మశక్యం కాలేదు. తొలుత నాకు సమాచారం రాగానే.. ఇది నిజమని అనుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రజల తరఫున ప్రతిఒక్కరికీ విజ్ఞప్తి చేస్తున్నా. పర్యాటకులకు మేఘాలయ సురక్షితమైన ప్రదేశం. దయచేసి రండి. సురక్షిత ప్రదేశం కాదంటూ కొందరు వ్యతిరేక ప్రచారం చేశారు. కానీ, నన్ను నమ్మండి. పర్యాటకులకు ఇది సురక్షితమైన రాష్ట్రం" అన్నారు. అసలు ఈ కేసులో అసలేం జరిగిందో కచ్చితంగా తెలుసుకొనేందుకు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. హనీమూన్‌కు వచ్చిన నవదంపతుల అదృశ్యం కేసులో మిస్టరీని ఛేదించేందుకు పోలీసులు నిద్రలేని రాత్రులు గడిపారని డిప్యూటీ సీఎం అన్నారు. ఈ దారుణ ఘటనలో ప్రమేయం ఉన్న వారిని గుర్తించి అరెస్టు చేయగలిగామని తెలిపారు. మరోవైపు, రాజా రఘువంశీ శరీరంపై అనేక గాయాలు ఉన్నట్లు పోస్టుమార్టం నివేదికలో వెల్లడైంది. ముఖ్యంగా తలపై రెండు చోట్ల తీవ్ర గాయాలను గుర్తించినట్లు నివేదికలో వైద్యులు పేర్కొన్నారు.

## వర్తమానాన్ని వదిలేసి..
## 2047 గురించి కలలా?: రాహుల్ విమర్శలు



దిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం గత 11 ఏళ్లుగా ఎలాంటి జవాబుదారీతనం లేకుండా కేవలం ప్రచారం మాత్రమే కొనసాగిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. వర్తమానం గురించి మాట్లాడటం మానేసి.. 2047 గురించి కలలు కంటోందని ధ్వజమెత్తారు. మహారాష్ట్రలోని థానే జిల్లాలో జరిగిన రైలు ప్రమాదంపై రాహుల్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. మోదీ సర్కార్ 11 ఏళ్లు పూర్తి చేసుకున్న సమయంలో.. ముంబయి నుంచి వస్తున్న విషాద వార్త దేశంలోని వాస్తవికతను ప్రతిబింబిస్తోందన్నారు. రైలు నుంచి కిందపడి పలువురు ప్రాణాలు కోల్పోయారు. భారతీయ రైల్వేలను కోట్లాది మంది ప్రజల జీవితాలకు వెన్నెముకగా అభివర్ణించిన రాహుల్ గాంధీ.. కానీ, ఆ సంస్థ ఈ రోజు అభద్రత, రద్దీ, గందరగోళానికి చిహ్నంగా మారిందని ఆరోపించారు. నరేంద్ర మోదీ పాలనలో జవాబుదారీతనం లేదు.. మార్పు లేదు.. కేవలం ప్రచారమే ఉందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం 2025 గురించి మాట్లాడటం మానేసి 2047 కోసం కలలు కంటోందన్నారు. ఈ రోజు దేశం ఎదుర్కొంటున్న సమస్యలను చూసేదెవరు? అని ప్రశ్నించారు. రైలు ప్రమాదంలో మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. థానే జిల్లాలోని ముంబ్రా, దివా స్టేషన్ల మధ్య సోమవారం ఉదయం రద్దీగా ఉన్న లోకల్ రైలు నుంచి పలువురు ప్రయాణికులు జారిపడిన ఘటనలో ఐదుగురు మృతి చెందగా.. పలువురికి గాయాలైన విషయం తెలిసిందే.

## మంత్రికే లంచం ఇవ్వజూపి..!
## పోలీసుల కస్టడీలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు

జైపుర్: మంత్రికే లంచం ఇవ్వడానికి ప్రయత్నించి.. ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఇరకాటంలో పడిన ఘటన రాజస్థాన్‌లో చోటుచేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాజస్థాన్ విద్యాశాఖ మంత్రి మదన్ దిలావర్ తన నివాసానికి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పాఠ్యాంశాల కమిటీలో తనకు చోటు కల్పించాలని కోరుతూ చంద్రకాంత్ వైష్ణవ్ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు కూడా లిఖితపూర్వక అభ్యర్థనతో అక్కడికి వచ్చారు. అయితే మంత్రికి అభ్యర్థన పత్రాన్ని ఇస్తున్న సమయంలో ఓ స్వీట్ డబ్బాతో పాటు రూ.5 వేలు ఉన్న కవరును అందజేశారు. కవరులో డబ్బు



ఉన్నట్లు గమనించిన మంత్రి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకొని, విచారిస్తున్నారు. అతడు ప్రస్తుతం బన్స్‌వారా జిల్లాలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో గ్రేడ్ 3 ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ తనకు అర్జీలు ఇస్తున్న విధంగానే ఉపాధ్యాయుడు కూడా వినతి పత్రం ఇచ్చాడని తాను భావించానని మంత్రి పేర్కొన్నారు. అనంతరం అందులో డబ్బు ఉన్నట్లు తన సిబ్బంది గుర్తించడంతో అతడిని అక్కడే ఉండమని చెప్పి పోలీసులకు ఫిర్యాదు చేశానని అన్నారు. దరఖాస్తులో ఉపాధ్యాయుడు తాను విద్యార్థి దశ నుంచి ఏబీవీపీ, సంఘ్ పరివార్‌తో సంబంధం కలిగి ఉన్నానని..దానిని కూడా పరిగణలోకి తీసుకోవాలని రాసినట్లు తెలిపారు. రాజస్థాన్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్‌తో అనుసంధానమైన ఉన్న పాఠ్యాంశాల కమిటీలో స్థానం సంపాదించాలని ఆశయంతో తాను మంత్రిని కలిసినట్లు ఆ ఉపాధ్యాయుడు పేర్కొన్నారు.

## రూ.2 వేల కోట్ల కుంభకోణం..
## విచారణకు మనీశ్ సిసోదియా గైర్హాజరు

దిల్లీ: దేశరాజధాని దిల్లీలోని పాఠశాల భవనాలు, తరగతి గదుల నిర్మాణాల్లో రూ. 2 వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారంటూ గత ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేతలు మనీశ్ సిసోదియా, సత్యేందర్ జైన్ లపై కేసులు నమోదైన సంగతి తెలిసిందే. ఈ కేసు విచారణ నిమిత్తం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వారికి సమన్లు జారీ చేసింది. అయితే, ఈ విచారణకు దిల్లీ మాజీ డిప్యూటీ సీఎం సిసోదియా గైర్హాజరయ్యారు. ఈ విషయాన్ని ఏసీబీ అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ కేసులో సోమవారం ఆయన అవినీతి నిరోధక శాఖ ఎదుట హాజరవ్వాల్సి ఉండగా.. సిసోదియా ఈరోజు విచారణకు రాలేరని ఆయన తరఫున న్యాయవాది తెలిపినట్లు ఏసీబీ వర్గాలు పేర్కొన్నాయి. తనకు కొన్ని ముఖ్యమైన పనులు ఉన్నందువల్ల విచారణకు హాజరుకావడం లేదని ఆయన నుంచి వర్తమానం అందినట్లు దర్యాప్తు వర్గాలు తెలిపాయి. అయితే మళ్లీ సమన్లు జారీ చేస్తామని ఏసీబీ అధికారులు వెల్లడించారు. ఈ కేసులో మనీశ్ సిసోదియాతో పాటు సత్యేందర్ జైన్‌ను కూడా ఏసీబీ విచారణకు పిలిచింది. శుక్రవారం జరిగిన విచారణకు జైన్ హాజరయ్యారు. జైన్‌ను అధికారులు 5 గంటల పాటు అధికారులు విచారించారు. అయితే, వాటికి తనకేమీ తెలియదంటూ సంబంధిత శాఖల అధికారులపైకి తోసేశారని అధికారులు తెలిపారు.

## కేరళ తీరం వద్ద సింగపూర్ పతాక నౌకలో పేలుడు..!

సింగపూర్ పతాకంతో ప్రయాణిస్తున్న ఓ కంటైనర్ షిప్‌లో సోమవారం ఉదయం భారీ పేలుడు చోటు చేసుకొంది. ఈ విషయాన్ని రక్షణశాఖ ప్రతినిధి వెల్లడించారు. ఉదయం 10.30 సమయంలో ఎంవీ వాన్ హై 503 కేరళ తీరానికి సమీపంలోకి చేరుకొన్న సమయంలో దాని లోపల పేలుడు సంభవించింది. వెంటనే అప్రమత్తమైన నౌకాదళం ఐఎన్ఎస్ సూరత్‌ను అత్యవసర సహాయం కోసం సదరు నౌక వద్దకు తరలించింది. దీంతోపాటు నేవల్ స్టేషన్ ఐఎన్ఎస్ గరుడ్ నుంచి డోర్నియర్ విమానంతో ఆ ప్రదేశంలో సార్టీలు చేపట్టింది. దాదాపు 270 మీటర్ల పొడవు ఉన్న ఈ నౌక జూన్ 7న కొలంబో తీరం నుంచి బయల్దేరింది. ఇది జూన్ 10వ తేదీ నాటికి ముంబయికి చేరుకోవాల్సి ఉంది. ఇటీవల లైబీరియాకు చెందిన ఎంఎస్‌సీ ఎల్సా3 నౌక ప్రమాదానికి గురైంది. కేరళ సముద్ర తీరానికి 38 నాటికల్ మైళ్ల దూరంలో తొలుత ఓ వైపునకు ఒరిగిపోయింది. దీంతో అందులోని కొన్ని కంటైనర్లు సముద్రంలో పడిపోయాయి. కంటైనర్ నౌక సముద్రంలో మునగడాన్ని గమనించిన ఇండియన్ కోస్ట్ గార్డ్ (ICG) వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టింది. అందులో ఉన్న మొత్తం 24 మంది సిబ్బందిని సురక్షితంగా తీరానికి చేర్చారు.

## స్టాక్ మార్కెట్‌లో నాలుగో రోజు ర్యాలీ..

**256 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్..!**



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లలో వరుసగా నాలుగో రోజు ర్యాలీ కొనసాగింది. ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ నిర్ణయం తర్వాత మార్కెట్లు పుంజుకున్నాయి. సీఆర్‌ఆర్ తగ్గింపు తదితర నిర్ణయాలు మార్కెట్‌లో పెట్టుబడిదారులను ఆకర్షించాయి. ఈ క్రమంలో వారంలోని తొలిరోజైన సోమవారం సెన్సెక్స్, నిఫ్టీ లాభాల్లో ముగిశాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే 30-షేర్ల బీఎస్ఈ సెన్సెక్స్ 82,574.55 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 82,369.24 పాయింట్ల కనిష్టాన్ని తాకిన సెన్సెక్స్.. అత్యధికంగా 82,669.00 పాయింట్లకు పెరిగింది. చివరకు 256.22 పాయింట్లు పెరిగి 82,445.21 పాయింట్ల వద్ద ముగిసింది.

నిఫ్టీ 100.15 పాయింట్లు పెరిగి.. 25,103.20 పాయింట్ల వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 2,667 షేర్లు లాభపడగా.. 1,374 షేర్లు పతనమయ్యాయి. రియల్టీ మినహా అన్ని ఇతర రంగాల సూచీలు ఐటీ, ఆయిల్ అండ్ గ్యాస్, పవర్, పీఎస్‌యూ బ్యాంక్ ఒక్కొక్కటి ఒకశాతం వరకు పెరిగాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక్కొక్కటి ఒకశాతం వరకు జంప్ చేశాయి. బజాజ్ ఫైనాన్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, జియో ఫైనాన్షియల్, ట్రెంట్ నిఫ్టీలో ప్రధాన లాభాలను ఆర్జించగా, ఐసీఐసీఐ బ్యాంక్, టైటాన్ కంపెనీ, ఎం అండ్ ఎం, అదానీ పోర్ట్స్, ఎటర్నల్ నష్టపోయాయి. బీఎస్ఈ-లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ మునుపటి సెషన్‌లో రూ.451.13 లక్షల కోట్ల నుంచి రూ.455.11 లక్షల కోట్లకు పెరగడంతో పెట్టుబడిదారుల సంపద రూ.3.9 లక్షల కోట్ల లక్షల కోట్లకు పెరిగింది. నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ రికార్డు స్థాయిలో కొనసాగింది. ఇండెక్స్ 57,049.50కి చేరుకుని 0.5 శాతం లాభపడింది. గోద్రేజ్ ఇండస్ట్రీస్, మణప్పురం ఫైనాన్స్, ఎంసీఎక్స్ ఇండియా, హ్యుందాయ్ మోటార్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ముత్తూట్ ఫైనాన్స్, లారస్ ల్యాబ్స్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, నువామా వెల్త్, హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ, బజాజ్ ఫైనాన్స్, ఆస్ట్రాజెనెకా ఫార్మా, ఎస్‌బీఐ కార్డ్స్, సిటీ యూనియన్ బ్యాంక్, నిప్పాన్ లైఫ్, ఎల్‌టీ ఫైనాన్స్, అనుపమ్ రసాయనన్, ఫోర్టిస్ హెల్త్‌కేర్, ఎస్‌ఆర్‌ఎఫ్ సహా 170 కంటే ఎక్కువ స్టాక్స్ బీఎస్ఈలో 52 వారాల గరిష్టాన్ని తాకాయి.

## ఆన్‌లైన్ ఫుడ్ బిజినెస్‌లోకి ర్యాపిడో..

**తక్కువ కమీషన్లతో స్విగ్గీ, జొమాటోకు గట్టి పోటీ ఇచ్చేందుకు రెడీ**




**న్యూఢిల్లీ:** ప్రముఖ క్యాబ్ సర్వీసుల సంస్థ ర్యాపిడో కొత్త బిజినెస్‌లోకి అడుగుపెట్టబోతున్నట్లు తెలుస్తోంది. తన వ్యాపార విస్తరణలో భాగంగా ఆన్ లైన్ ఫుడ్ డెలివరీ రంగంలోకి అడుగుపెట్టే యోచనలో ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం మార్కెట్‌లో ఆధిపత్యం చెలాయిస్తున్న స్విగ్గీ, జొమాటో సంస్థలకు గట్టి పోటీ ఇచ్చేందుకు రెడీ అయినట్లు తెలిసింది.

ప్రస్తుతం ఫుడ్ డెలివరీ మార్కెట్‌లో దిగ్గజ ఫుడ్ డెలివరీ సంస్థలైన జొమాటో, స్విగ్గీ ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. ఈ విభాగంలో ఎన్ని సంస్థలు ఉన్నా వాటిని వెనక్కి నెట్టి మొదటి రెండు స్థానాల్లో రాణిస్తూ.. మార్కెట్ లీడర్లుగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ రెండు సంస్థలకు గట్టి పోటీ ఇచ్చేందుకు ర్యాపిడో సిద్ధమవుతోంది. ఇందులో భాగంగానే పలు రెస్టారెంట్ల నిర్వాహకులతో సంస్థ ప్రతినిధులు సమావేశం అయినట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా నివేదిస్తోంది. నేషనల్ రెస్టారెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాతో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. జూన్ చివరి నాటికి లేదా జులై ప్రారంభంలో బెంగళూరులో ట్రైరన్ ఉంటుందని సమాచారం.

ఆర్డర్ విలువ ఆధారంగా రెస్టారెంట్ల నుంచి ర్యాపిడో 8 నుంచి 15 శాతం కమీషన్లు వసూలు చేస్తుందని ఎగ్జిక్యూటివ్‌లు తెలిపారు. రూ.400 కంటే తక్కువ ఆర్డర్‌లపై రూ.25, రూ.400 కంటే ఎక్కువ ఆర్డర్‌లపై రూ.50 రుసుముగా వసూలు చేయనున్నట్లు సమాచారం. జొమాటో, స్విగ్గీతో పోలిస్తే ఈ మొత్తం చాలా తక్కువ. ప్రస్తుతం ఆ రెండు సంస్థలూ 16 నుంచి 30 శాతం వరకూ రెస్టారెంట్ల నుంచి కమీషన్లు వసూలు చేస్తున్నాయి. 2015లో ర్యాపిడో క్యాబ్ బుకింగ్ సేవలను ప్రారంభించింది. ఇప్పటికే 100కుపైగా నగరాల్లో ర్యాపిడో బైక్, ఆటో, ఆటో షేర్, క్యాబ్ సేవలను అందిస్తోంది. 2025 నాటికి దేశ వ్యాప్తంగా మొత్తం 500 నగరాలకు తమ క్యాబ్ సేవలను విస్తరించాలని ర్యాపిడో కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పుడు ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ విభాగంలోకి సైతం ఎంట్రీ ఇస్తుండటం విశేషం.

## రికార్డు స్థాయికి చేరిన వెండి ధర



**న్యూఢిల్లీ:** ప్రపంచ వ్యాప్తంగా బలమైన సంకేతాల మధ్య సోమవారం రాజధాని ఢిల్లీ నగరంలో వెండి మరోసారి సరికొత్త గరిష్టాలను తాకింది. రూ.1000 పెరగడంతో కిలోకు రూ.1,08,100 పెరిగింది. మరో వైపు 99.9 శాతం ప్యూరిటీ గోల్డ్ ధర రూ.280 తగ్గి తులానికి రూ.రూ.97,780కి చేరింది. 99.5 శాతం ప్యూరిటీ పసిడి రూ.250 పతనమై.. తులానికి రూ.97,350కి చేరుకుంది. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ దీన్ని ధ్రువీకరించింది. పెట్టుబడిదారుల నుంచి బలమైన డిమాండ్, బలహీనమైన డాలర్, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, పెరిగిన విద్యుత్, ఈవీ డిమాండ్ కారణంగా వెండి ధరలు పెరిగాయని వ్యాపారులు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా స్పాట్ బంగారం స్వల్పంగా పెరిగి ఔన్స్‌కు 3,312.84 డాలర్లకు చేరుకుంది. సోమవారం మిశ్రమ సంకేతాల మధ్య బంగారం స్థిరంగా ఉందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్‌లోని కమోడిటీస్ సీనియర్ విశ్లేషకుడు సౌమిల్ గాంధీ తెలిపారు.

అమెరికా, చైనా మధ్య వాణిజ్య చర్చల అంచనాలు సురక్షిత ఆస్తులకు డిమాండ్ తగ్గేందుకు పరిస్థితులు దారి తీశాయని చెప్పారు. అమెరికాలో తాజా నాన్‌ఫార్మ్ పేరోల్స్ రిపోర్ట్ బలంగా ఉన్నది. ఇది ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య విధానాన్ని సులభతరం చేస్తుందని వ్యాపారులు ఆశిస్తున్నారు. ఇక అంతర్జాతీయ మార్కెట్ స్పాట్ వెండి 0.9శాతం పెరిగి ఔన్స్‌కు 36.30కి చేరుకుంది. అంతర్జాతీయంగా వెండి ధరలు 13 ఏళ్ల గరిష్టానికి చేరుకున్న తర్వాత బలమైన లాభాలతో పుంజుకుంటున్నాయని మెహతా ఈక్విటీస్ కమోడిటీస్ వైస్ ప్రెసిడెంట్ రాహుల్ కలాంత్రి తెలిపారు. యూరోపియన్ ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడం, వాణిజ్యంపై భారీ అంచనాలు వెండికి మద్దతునిచ్చాయని కలాంత్రి చెప్పారు. దీర్ఘకాలిక కన్సాలిడేషన్ శ్రేణిని బ్రేక్ చేస్తూ, వెండి ధర ఔన్స్‌కు 36 డాలర్ల స్థాయిని దాటగలిగింది. ఇదిలా ఉండగా.. హైదరాబాద్‌లో 24 క్యారెట్స్ గోల్డ్ రూ.97,690.. ఇక 22 క్యారెట్ల పసిడి రూ.89,550 పలుకుతున్నది. వెండి ధర కిలోకు రూ.1,08లక్షల వద్ద కొనసాగుతున్నది.

## తెలుగు నేలపై ఐపీఎల్ తరహా

# టీ20 లీగ్

## ఆగస్టులో ఆరంభం..!




న్యూఢిల్లీ: పొట్టి క్రికెట్ స్వరూపాన్ని మార్చేసిన ఐపీఎల్ పలు దేశాల్లో టీ20 లీగ్స్‌కు బీజం వేసింది. ఐపీఎల్ సూపర్ హిట్ కావడంతో మనదేశంలో మహిళా క్రికెట్ పురోగతిని దృష్టిలో పెట్టుకొని బీసీసీఐ మహిళల ప్రీమియర్ లీగ్‌కు రూపమిచ్చింది. ఈ నేపథ్యంలో ఆంధ్ర క్రికెట్ సంఘం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. మహిళా క్రికెట్ అభ్యున్నతి కోసం గతంలో నిర్వహించిన ఐపీఎల్ తరహా లీగ్‌ను పునరుద్ధరించాలని సంకల్పించింది. విజయవాడలో జరిగిన వార్షిక సమావేశంలో ఏసీఏ ప్రతినిధులు ఈ తీర్మానానికి వచ్చారు.

ఇప్పటికే ఆరు పురుషుల జట్లతో ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌ను నిర్వహిస్తోంది ఏసీఏ. ఈ లీగ్ విజయవంతం కావడంతో మహిళా క్రికెటర్ల నైపుణ్యాలు మెరుగుపరచడంతో పాటు వాళ్లకు జాతీయ జట్టుకు ఎంపికయ్యేలా చేయాలని ఏసీఏ లక్ష్యంగా పెట్టుకుంది. ఇంతకుముందు మహిళా క్రికెటర్లతో ఆంధ్రా ఉమెన్స్ టీ20 లీగ్‌ను నిర్వహించిన అనుభవమూ అసోసియేషన్‌కు ఉంది. మూడు జట్లు తలపడే ఈ టోర్నీ నిరుడు అర్ధాంతరంగా వాయిదా పడింది. అయితే.. ఈ ఏడాది మరొక జట్టును చేర్చి.. మొత్తంగా 4 టీమ్స్‌తో లీగ్‌ను జరపాలనే ఉద్దేశంతో ఉన్నారు క్రికెట్ సంఘం పెద్దలు.

'మహిళా క్రికెటర్ల కోసం ఐపీఎల్ తరహాలో టీ20 లీగ్ జరపాలనే నిర్ణయం రాష్ట్రంలో మహిళల క్రికెట్ అభ్యున్నతి ఏసీఏ కృషికి నిదర్శనం కానుంది. ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్(విజయవాడ ఎంపీ), కార్యదర్శి ఎస్ సతీశ్ మహిళా క్రికెట్ పురోగతికి కట్టుబడి ఉన్నారు' అని సోమవారం ఆంధ్రా క్రికెట్ సంఘం అధికారి ఒకరు వెల్లడించారు. ఆగస్టులో మహిళల టీ20 లీగ్ నిర్వహణకు సన్నాహకాలు చేస్తున్నామని ఏసీఏ వర్గాలు తెలిపాయి.

**మిథాలీ రాజ్ కన్వీనర్‌గా**

కానీ, ఏకకాలంలో అటు పురుషుల, ఇటు మహిళల లీగ్ నిర్వహణ సవాల్‌గా మారనుంది. ఎందుకంటే.. స్టేడియం, ఆటగాళ్ల కిట్, ఇతర సామగ్రి.. వంటివాటిని తరలించడం ఖర్చు, సమయంతో కూడిన పని. అయినా సరే ఆగస్టులో రెండు లీగ్స్‌ను జరిపేందుకు ఏసీఏ సిద్ధమవుతోంది. ప్రస్తుతానికి నిర్వహణ వ్యయం అంతా అసోసియేషన్ చూసుకోనుంది. త్వరలోనే దీన్ని ఫ్రాంచైజీ లీగ్‌గా మార్చాలనే ఆలోచనతో ఉంది ఏసీఏ. టీమిండియా మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ ప్రస్తుతం ఏపీ మహిళా క్రికెట్‌కు కన్వీనర్‌గా వ్యవహరిస్తోంది. ఆమె సలహాలు సూచనలను ఆచరణలో పెడుతూ మహిళా క్రికెట్ కార్యక్రమాలను చూసుకునేందుకు త్వరలోనే ఒక కమిటీని ఏర్పాటు చేయనుంది ఏసీఏ. అంతేకాదు పూర్తిగా మహిళా సభ్యులతో కూడిన సెలెక్షన్ కమిటీకి కూడా రూపమివ్వనుందనే వార్తలు వినిపిస్తున్నాయి.

## ఆసీస్ ఆటగాళ్లకు చేదు అనుభవం..




**లార్డ్స్‌లో ప్రాక్టీస్‌కు అనుమతి నిరాకరణ**

**లార్డ్స్:** వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ బుధవారం నుంచి లార్డ్స్ మైదానంలో ప్రారంభంకానున్నది. దక్షిణాఫ్రికాతో ఆ ఫైనల్లో ఆడేందుకు ఆస్ట్రేలియా జట్టు అక్కడకు చేరుకున్నది. అయితే ప్రాక్టీస్ కోసం శనివారం లార్డ్స్ మైదానం వెళ్లిన ఆస్ట్రేలియా క్రికెట్ జట్టుకు చేదు అనుభవం ఎదురైంది. ఆ జట్టుకు అక్కడ ప్రాక్టీస్ చేసుకునే అవకాశం దక్కలేదు. లార్డ్స్ క్రికెట్ గ్రౌండ్‌లో శిక్షణకు పర్మిషన్ దక్కలేదు. ఈ ఘటనకు చెందిన రిపోర్టు ఒకటి బయటకు వచ్చింది. ప్యాట్ కమ్మిన్స్ జట్టుకు అనుమతి దక్కకపోవడం పట్ల కారణం ఏంటో తెలిసింది.

ఇంగ్లండ్‌తో అయిదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆడేందుకు ఇండియా కూడా ఇటీవల లార్డ్స్‌కు చేరుకున్నది. శనివారం ఇండియన్ జట్టు లార్డ్స్‌లో ప్రాక్టీస్ చేసింది. అయితే ఆ సమయంలోనే ఆసీస్ జట్టు అక్కడకు రావడంతో వాళ్లకు ఎంట్రీ దక్కలేదు. ఇండియన్ జట్టుకు ట్రైనింగ్ కోసం పర్మిషన్ ఇచ్చినట్లు ఫాక్స్ క్రికెట్ పేర్కొన్నది. వాస్తవానికి జూన్ 11 నుంచి దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా మధ్య లార్డ్స్‌లో డబ్ల్యూటీసీ ఫైనల్ జరగాల్సి ఉంది. కానీ ఇండియన్ జట్టు జూన్ 20 నుంచి టెస్టు సిరీస్ ఆడనున్నది. శనివారం ఆసీస్ ఆటగాళ్లకు పర్మిషన్ దక్కకున్నా.. ఆదివారం మాత్రం లార్డ్స్‌లోనే ప్రాక్టీస్ చేశారు.

## స్వదేశంలో వెస్టిండీస్, ఆస్ట్రేలియా సిరీస్..

## మ్యాచ్ వేదికల్లో మార్పులు.!




**న్యూఢిల్లీ:** ఐపీఎల్ ముగియడంతో ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లిన భారత జట్టు అనంతరం స్వదేశంలో వన్డే సిరీస్ ఆడనుంది. మహిళల జట్టు సైతం సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో తలపడనుంది. ఈ నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి సోమవారం మ్యాచ్ వేదికలను ఖరారు చేసింది. అయితే.. షెడ్యూల్ ప్రకారం ముందస్తుగా కేటాయించిన మైదానాల్లో స్వల్ప మార్పులు చేసింది బీసీసీఐ.

వెస్టిండీస్ పురుషుల జట్టు అక్టోబర్‌లో రెండు టెస్టుల సిరీస్ కోసం భారత పర్యటనకు రానుంది. ఇరుజట్ల మధ్య తొలి మ్యాచ్ అక్టోబర్ 2న అహ్మదాబాద్‌లో జరుగనుంది. అనంతరం 10వ తేదీన రెండో టెస్టు కోల్‌కతాలో జరగాల్సింది. కానీ, ఈ మ్యాచ్‌ను వేదికను ఢిల్లీకి తరలించింది బీసీసీఐ. నవంబర్ 14న భారత్, దక్షిణాఫ్రికాలు ఢిల్లీలోని అరుణ్ జైట్లీ మైదానంలో తొలి టెస్టు ఆడాల్సింది. కానీ, ఇప్పుడు ఆ మ్యాచ్‌కు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదిక కానుంది.

**చిదంబరంలో కాదు**

హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా స్వదేశంలో ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో అమీతుమీ తేల్చుకోనుంది. ఇంతకుముందు ఈ మూడు వన్డేల సిరీస్‌ను చెన్నైలోని చిదంబరం స్టేడియంలో నిర్వహించాలనుకున్నారు. కానీ, కానీ, అక్కడ పిచ్, ఔట్‌ఫీల్డ్ మరమ్మతు పనులు జరుగుతున్నందున వేదికను మార్చాలని బీసీసీఐ భావించింది. అందుకే వీటిలో తొలి రెండు మ్యాచ్‌లను ఛండీగఢ్‌లో, చివరి వన్డేను ఢిల్లీలో జరపాలని బీసీసీఐ నిర్ణయించింది.

అలానే భారత 'ఏ' జట్టుతో దక్షిణాఫ్రికా 'ఏ' జట్టు మ్యాచ్‌ల వేదిక కూడా మారింది. నవంబర్ 13 నుంచి మూడు వన్డే మ్యాచులకు చిన్నస్వామి స్టేడియం ఆతిథ్యం ఇవ్వాల్సింది. అయితే.. ఈ మైదానం బదులు రాజ్‌కోట్‌లో సఫారీ ఏ జట్టుతో భారత కుర్రజట్టు తలపడనుంది.

## హిట్‌మ్యాన్ రిటైర్మెంట్..

## టీమ్ బస్సులో ఒంటరైన జడేజా.. !



**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్ పర్యటనను విజయంతో ఆరంభించేందుకు భారత బృందం ప్రాక్టీస్ సెషన్లతో బిజీగా గడుపుతోంది. సమిష్టిగా రాణించి సిరీస్ పట్టేయాలనే కసితో ఉంది టీమిండియా. అయితే.. ఇంగ్లండ్‌లో సహచరులంతా హుషారుగా ఉంటే రవీంద్ర జడేజా మాత్రం టీమ్ బస్సులో డల్‌గా ఉంటున్నాడు. అందుకు కారణం ఏంటి? అని ఆరా తీయగా.. అసలు విషయం బయటపడింది. ఎప్పుడూ బస్సులో పక్కనే కూర్చుండే రోహిత్ శర్మ లేకపోవడంతోనే జడేజా బోసిపోయినట్టుగా కనిపిస్తున్నాడట.

నిరుడు న్యూజిలాండ్, ఆస్ట్రేలియా జట్లపై విఫలమైన రోహిత్ శర్మ మే 7న రోహిత్ టెస్టులకు వీడ్కోలు పలికాడు. హిట్‌మ్యాన్ రిటైర్మెంట్‌తో సుదీర్ఘ ఫార్మాట్‌లో అతడి ఫుల్ షాట్లను ఎంజాయ్ చేసే అవకాశం కోల్పోయారు ఫ్యాన్స్. కానీ, జడేజా మాత్రం టీమ్ బస్సులో ఎల్లప్పుడూ జడ్డూ పక్కన కూర్చుండే వ్యక్తిని కోల్పోయాడు. విదేశీ పర్యటనల్లో అయినా.. స్వదేశంలో అయినా రోహిత్, జడ్డూలు పక్కపక్కనే కూర్చుండేవారు. ఆద్యంతం జోకులు పేలుస్తూ నవ్వించే హిట్‌మ్యాన్‌ను ఇంగ్లండ్ పర్యటనలో జడేజా ఎంతో మిస్ అవుతున్నాడు. ప్రస్తుతం అతడు టీమ్ బస్సులో ఒంటిరిగా కూర్చుంటున్నాడు. పక్క సీటు ఖాళీగాను ఉంటోంది. దాంతో, రోహిత్ రిటైర్మెంట్‌తో ఒంటరి అయిన జడేజా అంటూ అభిమానులు వీడియోలు పెడుతున్నారు. ఇంకేముంది ఈ ఆల్‌రౌండర్ నెట్టింట ట్రెండింగ్ అవుతున్నాడు. సీనియర్ స్పిన్నర్ అశ్విన్ గైర్హాజరీలో స్పిన్ బౌలింగ్ విభాగానికి జడ్డూనే నాయకత్వం వహించనున్నాడు.

భారత సీనియర్ క్రికెటర్ అయిన రవీంద్ర జడేజా టెస్టుల్లో చెక్కుచెదరని రికార్డు నెలకొల్పాడు. అత్యధిక రోజులు నంబర్ 1 ర్యాంక్‌లో కొనసాగిన ఆల్‌రౌండర్‌గా జడ్డూ చరిత్ర సృష్టించాడు. మూడేళ్ల క్రితం అగ్రస్థానం కైవసం చేసుకున్న జడేజా ఇప్పటికీ టాప్‌లోనే ఉన్నాడు. మే 14వ తేదీ నాటికి అతడు నంబర్ 1గా 1,151 రోజులు పూర్తి చేసుకున్నాడు. 144 ఏళ్ల టెస్టు క్రికెట్ చరిత్రలో ఇంతకాలం అగ్రస్థానంలో ఉన్న ఆల్‌రౌండర్ జడేజానే కావడం విశేషం.

# రాజమౌళి మూవీలో విలన్ పాత్ర

### సున్నితంగా తిరస్కరించిన విక్రమ్





**టాకీస్:** ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రేక్షకులంతా ఆత్రుతగా ఎదురుచూస్తున్న ప్రాజెక్ట్ లో రాజమౌళి- మహేశ్ ప్రాజెక్ట్ ఒకటి. భారీ స్థాయిలో రూపొందిస్తున్న ఈ మూవీలో అగ్ర తారలు ఇందులో భాగం కానున్నారు. అయితే తాజాగా ఓ వార్త వైరల్ అవుతుంది. ఏంటంటే.. తమిళ స్టార్ హీరో విక్రమ్ న్ను ఈ చిత్రంలో కీలకపాత్ర కోసం ఎంపిక చేయగా ఆయన ఈ ఆఫర్‌ను సున్నితంగా రిజెక్ట్ చేశారట. అది విలన్ పాత్ర కావడంతో ఆయన నో చెప్పారని సమాచారం. విక్రమ్ విలన్ రోల్ చేయకూడదని నిర్ణయించుకోవడంతో ఈ అవకాశాన్ని

రిజెక్ట్ చేశారని టాక్. దీంతో ఈ పాత్రలో పృథ్వీరాజ్ సుకుమారన్ నటించనున్నట్లు- తెలుస్తోంది. ప్రజంట్ ఈ వార్త వైరల్ గా మారింది. ఇక ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతున్నప్పటికీ. ఇంతవరకు ఈ మూవీలోని ఒక్క పాత్రకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడలేదు. కాగా.. ఇందులో ఆర్.మాధవన్ ఓ కీలక పాత్రలో నటించనున్నట్లు- కూడా ఇటీ-వల టాక్ వినిపించింది. త్వరలోనే ఆయన సెట్స్ లోకి అడుగు పెట్టనున్నట్లు- ప్రచారం. ప్రజంట్ మాధవన్ కూడా డిఫరెంట్ కం-టె-ంట్‌ను ఎంచుకుంటు మంచి మంచి సినిమాలు సిరీస్‌లో నటిస్తూ ఫామ్ లోనే ఉన్నారు. కానీ దీని గురించి కూడా ఎలాంటి అధికారిక ప్రకటన లేదు.

# బాలయ్య ఫ్యాన్స్‌కి పూనకాలు తెప్పిస్తున్న అఖండ 2 టీజర్..

### గూస్‌బంప్స్ తెప్పిస్తున్న సీన్స్

**టాకీస్:** గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, బ్లాక్ బస్టర్ చిత్రాల దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం అఖండ2. తొలి పార్ట్ సూపర్ హిట్ సాధించడంతో రెండో పార్ట్‌పై అంచనాలు భారీగా ఉన్నాయి. రేపు బాలయ్య బర్త్ డే సందర్భంగా టీజర్ విడుదలైంది. ఈ టీజర్ ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పిస్తుంది. సింహం శివుడి రూపంలో ఉందా అన్నట్లుగా బాలయ్య ఎంట్రీ అదిరిపోయింది. గతంలో ఎప్పుడు కనిపించని విధంగా బాలయ్య కనిపించే సరికి ఫ్యాన్స్‌కి పిచ్చెక్కిపోతుంది. త్రిశూలం చేతబట్టి, ఒళ్లంతా విబూదితో జటాజూటధారియై.. ధర్మాన్ని కాపాడేందుకు సాక్షాత్తూ పరమశివుడే సింహం రూపంలో వస్తున్నాడా అన్నట్టుగా బాలయ్యని పవర్ ఫుల్ లుక్‌లో చూపించారు బోయపాటి.

అభిమానుల అంచనాలని ఏమాత్రం తగ్గకుండా పవర్ ఫుల్




బాలయ్య తనదైన శైలిలో డైలాగ్స్‌తో అదరగొట్టారు. 'నా శివుడి అనుమతి లేనిదే.. ఆ యముడు కన్నేత్తి చూడడు.. నువ్వు చూస్తావా..' అంటూ చెప్పిన డైలాగ్ చాలా బాగుంది. ఇక తమన్ ఎప్పటి మాదిరిగానే బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ తో అదరగొట్టేశారు.. మొత్తంగా టీజర్ గూస్ బంప్స్ తెప్పిస్తోంది. ఇక ఈ టీజర్‌తో చిత్రంపై అంచనాలు మరింతగా పెరిగిపోయాయి. డైరెక్టర్ బోయపాటి మార్క్ కనిపించేలా బాలయ్య 'అఖండ రుద్ర తాండవం' గూస్ బంప్స్ తెప్పిస్తోంది. 'శంభో' అంటూ హిమాలయాల బ్యాక్ గ్రౌండ్‌తో టీజర్ ప్రారంభం కాగా.. యాక్షన్‌తో గూస్ బంప్స్ తెప్పించేలా బాలయ్యను చూపించారు బోయపాటి. వేదం చదివిన శరభం యుద్ధానికి ఎదిగింది అంటూ సాగే డైలాగ్ మూవీపై హైప్ పెంచింది. ఈ సినిమాను 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై నిర్మాత రామ్ ఆచంట, గోపిచంద్ ఆచంట నిర్మిస్తున్నారు. ఈ సినిమాను నందమూరి తేజస్విని సమర్పించడం విశేషంగా మారింది. ఇక ఈ సినిమాలో సంయుక్త హీరోయిన్‌గా నటిస్తున్నారు. అయితే నట సింహం బాలయ్య బర్ డే సందర్భంగా విడుదలైన టీజర్ నెట్టింట హల్‌చల్ చేస్తుంది.

# నెట్టింట పాపులర్.. మన సీత




టాకీస్: హీరోయిన్ మృణాల్ ఠాకూర్ గురించి అందరికీ తెలిసిందే. తన అందం, అభినయంతో ఈ ముద్దుగుమ్మ.. స్పెషల్ ఫ్యాన్ బేస్‌ను సంపాదించుకుంది. 2018లో 'లవ్ సోనియా' చిత్రంతో బాలీవుడ్‌లో అడుగు పెట్టి.. ఆ తర్వాత 'తుఫాన్', 'ధమాక', 'జెర్సీ' సినిమాల్లో నటించింది. అదే సమయంలో దుల్కర్ సల్మాన్‌తో 'సీతారామం' మూవీతో టాలీవుడ్ ఎంట్రీ- ఇచ్చి.. సీతాగా అందరి మనసులు దోచేసింది. తన వింటేజ్ లుక్, మెస్మరైజింగ్ యాక్టింగ్ తో తెలుగు ప్రేక్షకులను కట్టిపడేసింది. అయితే తాజాగా ఈ ముద్దుగుమ్మకు సంబంధించిన న్యూస్ ఒకటి వైరల్ అవుతుంది..సోషల్ మీడియాలో మోస్ట్ పాపులర్ యాక్ట్రెస్‌గా నిలిచింది మన సీత. నెట్టింట ఆమె కోసమే ఎక్కువగా మాట్లాడుకున్నారట. ఎందుకంటే ఆమెకు సంబంధించిన పిక్స్ ఎప్పడూ వైరల్ అవుతూనే ఉంటాయి. సినిమాలతో బిజీగా ఉన్నా.. నెట్టింట ఎప్పటికప్పడు కొత్త పిక్స్ ను షేర్ చేస్తుంటుంది మృణాల్. హీట్ పుట్టించే ఫొటోలతో పాటు- స్పైసీ క్లిక్స్ ను పోస్ట్ చేస్తుంటుంది. ఆమె క్యాప్షన్ కూడా క్రేజీ ఉంటాయి. దీంతో అమ్మడు పోస్టులు ఎప్పడు ట్రెండింగ్ లోనే ఉంటాయి. మొత్తానికి ఆమె ఇప్పడు నెట్టింట మోస్ట్ పాపులర్ నటి అనే అరుదైన ఘనత సాధించింది.

# కెరీర్ ఈ స్థాయిలో ఉందంటే అదృష్టమే: అవికా గోర్




టాకీస్: యంగ్ హీరోయిన్ అవికా గోర్ గురించి పరిచయం అక్కర్లేదు. చిన్నారి పెళ్లికూతురు సిరియల్లో బాలనటిగా ఎంట్రీ- ఇచ్చి దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు సంపాదించుకుంది. తర్వాత హీరోయిన్‌గా అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మించిన 'ఉయ్యాల జంపాల' చిత్రంతో టాలీవుడ్‌కి పరిచయమైన అవికా గోర్.. అనంతరం వరుస సినిమాలు తీసినప్పటికి, హీరోయిన్‌గా బారీ స్టార్ డమ్ మాత్రం అందుకోలేకపోయింది. అయనప్పటకి ఈ అమ్మడు ఫలితం ఆశించకుండా లైన్ గా సినిమాలు సిరీస్‌లు తీస్తునే ఉంది. అయితే ఇటివల ఓ అవార్డ్ ఫంగ్షన్‌లో మాట్లాడిన అవికా కాస్త ఎమోషనల్ కామెంట్స్ చేసింది.. 'బాలికా వధు'తో మొదలైన నా కెరీర్ ఈ స్థాయికి ఎదగడం నిజంగా నా అదృష్టం. ప్రేక్షకులు ఈ రోజు నాకు ఈ స్థాయినిచ్చిన ప్రతి ఒక్కరికి నా కృతజ్ఞతలు. అధికారిక శిక్షణ లేదా చిత్ర పరిశ్రమ నేపథ్యం లేకుండానే ఈ స్టేజ్‌లో ఉన్నాను. కనీసం నాకు ఇంటి నుంచి కూడా సరైన మద్ధతు లేదు. అయినా నటిగా ఒక స్థాయికి ఎదిగినందుకు ఆనందంగా ఉంది. మంచి పాత్రలు వచ్చినప్పడు బాధ్యతగా నటించి విజయం అందుకునేలా చేయడం ఆర్టిస్టు బాధ్యత. టె-లివిజన్ లేదా సినిమా ఏదైనా సరే నేను ఒకే విధంగా పని చేస్తాను. నేను దానిని తేలికగా తీసుకోలేను. ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొని ఒడిదుడుకులను అధిగమించి అనుకున్న స్థాయికి చేరతానని తెలిపింది అవికా.

# డెహ్రాడూన్ చేరుకున్న చిరంజీవి అనిల్ రావిపూడి టీం



**టాకీస్:** టాలీవుడ్ స్టార్ యాక్టర్ చిరంజీవి ప్రస్తుతం బ్యాక్ టు-బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. ఇప్పటికే బింబిసార ఫేం మల్లిడి వశిష్ఠ దర్శకత్వంలో నటిస్తున్న విశ్వంభర షూటింగ్ పూర్తి చేశాడు. విశ్వంభర మూవీ విడుదలకు సంబంధించిన కొత్త అప్‌డేట్ రావాల్సి ఉంది. మరోవైపు అనిల్ రావిపూడి డైరెక్షన్‌లో చిరంజీవి నటిస్తున్న మెగా 157 ప్రాజెక్ట్ కూడా సెట్స్‌పైకి వెళ్లింది. ఇప్పటికే ఓ షెడ్యూల్ పూర్తయినట్టు- వార్తలు కూడా వచ్చాయి. తాజాగా చిరంజీవి అనిల్ రావిపూడి టీం డెహ్రాడూన్‌లో ల్యాండ్ అయింది. మెగా 157 నెక్ట్స్ షెడ్యూల్ డెహ్రాడూన్‌లో ప్లాన్ చేసింది అనిల్ రావిపూడి టీం. ఎప్పుడో మొదలైన విశ్వంభర కోసం చాలా కాలంగా ఎదురుచూస్తూ నిరాశలో ఉన్న అభిమానులలో అనిల్ రావిపూడి జెట్‌స్పీడ్‌లో మెగా 157 మూవీ షూటింగ్ కొనసాగిస్తూ ఫుల్ జోష్ నింపుతున్నాడు. ఈ సినిమాను షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి, చిరంజీవి కుమార్తె సుస్మిత సంయుక్తంగా నిర్మిస్తున్నారు. చిరంజీవి ఈ చిత్రంలో తన రియల్ లైఫ్ నేమ్ శంకర్ వరప్రసాద్ పాత్రలో కనిపించనున్నాడు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నాడు.

# మణిరత్నంతో సినిమా చేయాలని ఉంది: అమీర్ ఖాన్

**టాకీస్:** తరచు వార్తలో నిలిచే బాలీవుడ్ స్టార్ హీరోలో అమిర్ ఖాన్ ఒకరు. హింది తో పాటు తెలుగు, తమిళం భాషలోనే కాకుండా దక్షిణాదిలో కూడా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆయన. విభిన్న కథలు, విభిన్న పాత్రలతో ఆడియన్స్‌ని అలరిస్తూ ఉంటారు. ప్రస్తుతం 'సీతారే జమీన్ పర్ ' అనే చిత్రం జూన్ 20న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ప్రజంట్ ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా వరుస ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా తాజాగా తమిళ దిగ్గజ దర్శకుడు మణిరత్నం గురించి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. అమిర్ ఖాన్ మాట్లాడుతూ.. 'సౌత్‌లో నాకు మణిరత్నం సినిమాలు అంటే చాలా ఇష్టం. ఆయన మంచి విజనరీ. ఎలాంటి సినిమాలను అయినా చాలా బ్యాలెన్స్ చేయగలరు.. చెన్నై వెళ్ళినప్పు డల్లా ఆయనను కలుస్తుంటాను. ఎన్నో సార్లు మేమిద్దరం కలిసి



పని చేయాలని అనుకున్నాం కానీ ఏదో ఒక అడ్డంకి వచ్చేది. ఓ సారి మా ఇద్దరి కాంబోలో 'లజో' అనే మూవీ కూడా అనుకున్నాం. కానీ, అనుకోని కారణాలతో అది చేయలేకపోయాం. కానీ ఎన్నటికైనా మణిరత్నం గారితో మూవీ చేయాలని ఉంది. అది భవిష్యత్‌లో నెరవేరుతుందనే ఆశ నాకుంది. ' అంటూ అమిర్ ఖాన్ మణిరత్నం గురించి క్రేజీ కామెంట్స్ చేశాడు. ప్రజంట్ ఈ మాటలు వైరల్ అవుతున్నాయి.

# కించపరిస్తే ఊరుకోం..

### కన్నప్ప చిత్రబృందానికి బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య హెచ్చరిక

**టాకీస్:** చట్టాలను ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదని తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య తెలంగాణ ప్రాంతీయ కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు హెచ్చరించారు. సోమవారం సరోజిని డాక్టర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రాహ్మణులను కానీ, ఇతర కులాలను కానీ, మతాలను కానీ కించపరిస్తే ఊరుకోమని హెచ్చరించారు. మంచు మోహన్ బాబు కుటుంబం బ్రాహ్మణ జాతి పై పగబట్టిందనే బాధ బ్రాహ్మణులలో నెలకొని ఉందని శ్రీనివాస్ రావు అన్నారు. గతంలో దేనికైనా రెడీ అనే సినిమాలో బ్రాహ్మణులను కించపరిచే సన్నివేశాలు చిత్రించడమే కాకుండా బ్రాహ్మణులపై భౌతిక దాడులకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయని అన్నారు. తాజాగా కన్నప్ప అనే సినిమాలో పిలక-గిలక అనే రెండు పాత్రలను రూపొందించి బ్రాహ్మణులను కించపరిచారని మండిపడ్డారు.

మంచు మోహన్ బాబు కుటుంబం చట్టాలను ఉల్లంఘించిందని,




కన్నప్ప సినిమాపై కోర్టులో కేసు ఉండగానే ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించడం చట్టాలను ఉల్లంఘించడం కాదా? అని ఆయన ప్రశ్నించారు. వృత్తిపరంగా బ్రాహ్మణులనే కాదు ఏ కులం వారినైనా కించపరిచే విధంగా సన్నివేశాలను చిత్రీకరించడం ఫ్యాషన్‌గా మారిందని అన్నారు. తక్షణమే మోహన్ బాబు కుటుంబం యావత్ మానవ జాతికి క్షమాపణ చెప్పి "కన్నప్ప" సినిమాలో ఉన్న పిలక-గిలక సన్నివేశాలను తొలగించాలని శ్రీనివాసరావు కోరారు. ఇందుకోసం న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.